భూ సమీకరణను విజయవంతం
## చేసిన చరిత్ర అమరావతి రైతులదే



7 లో


# మనం
కృష్ణా / గుంటూరు
ఎన్టీఆర్ - బాపట్ల - పల్నాడు
గురువారం | 17 | సెప్టెంబర్ | 2026 | పేజీలు: 11







## విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి

# పెద్దపీట

2 లో

కారుణ్య నియామకాల ద్వారా కూటమి ప్రభుత్వంలో 389 మందికి ఉద్యోగాలు

నేడు 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామకాలు

రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

పి.మీరాహుస్సేన్ ఖాన్

-విజయవాడ, మనంబ్యూరో



6 లో

ఎన్టీఆర్ జిల్లా నందిగామ
వాసవి మార్కెట్ లో ఏర్పాటు చేసిన గణనాథుడిని
దర్శించుకున్న జర్నలిస్టు సంఘ జాతీయ
నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్

## ఆయిల్‌ఫామ్ సాగుతో రైతుల ఆదాయం పెంపు

### ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి
### రైతులకు కలెక్టర్ డీకే బాలాజి పిలుపు

4 లో



# విద్యుత్ శాఖలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

**కారుణ్య నియామకాల ద్వారా కూటమి ప్రభుత్వంలో 389 మందికి ఉద్యోగాలు**

**నేడు 25 మందికి ఏపీసీపీడీసీఎల్ లో కారుణ్య నియామకం కింద ఉద్యోగ నియామకాలు**

**రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**(విజయవాడ.మనం బ్యూరో):** రాష్ట్రంలో విద్యుత్ శాఖ ఉద్యోగుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్యుత్ రంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. స్థానిక గుణదలలోని ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ల్లో కారుణ్య నియామక ఉత్తర్వులు అందించే ప్రదాన కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న వివిధ ఉద్యోగ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కారుణ్య నియామకాల ద్వారా 389 మందికి ఉద్యోగాలు కారుణ్య నియామకాల కింద తాజాగా 25 మంది ఉద్యోగార్థులకు ఉద్యోగ నియామక పత్రాలను మంత్రి అందజేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్ కో, జెన్కో, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు మొత్తం 389 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. మరణించిన విద్యుత్ శాఖ ఉద్యోగుల కుటుంబాల్లో వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగి పిల్లలు చిన్న వయస్సులో ఉన్నా, అర్హత కలిగిన వయస్సుకు వచ్చినా వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన మరో 35 నుంచి 45 మందికి కట్ఆఫ్ తేదీని నిర్ణయించి ప్రత్యేకంగా పరిగణించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

629 ఏఈ పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించాం త్వరలో ఫలితాలు అందిస్తామని, విద్యుత్ శాఖలోని అన్ని విభాగాలను కలిపి 629 అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహించామని మంత్రి తెలిపారు.త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా నియామక ప్రక్రియను నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు విద్యుత్ శాఖ ఉద్యోగులకు మూడు డిఏ లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎలక్ట్రిసిటీ విభాగం పనిచేస్తోందన్నారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు మెరుగైన శిక్షణ అందించేందుకు విశాఖపట్నంలో దాదాపు రూ. 30 కోట్ల వ్యయంతో ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్ను నిర్మించామని మంత్రి తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగులకు నాణ్యమైన శిక్షణ అందించడమే దీని ఉద్దేశమన్నారు.




## గ్రీన్ ఎనర్జీకి ప్రోత్సాహం

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సోలార్, విండ్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. సౌర విద్యుత్ వినియోగాన్ని మరింత విస్తరించే చర్యల్లో భాగంగా సుమారు 6 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల కుటుంబాలకు సూర్య ఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా సుమారు రూ. 10,000 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. విద్యుత్ శాఖలో ఉద్యోగ నియామకాలతో పాటు ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, పునరుత్పాదక ఇంధన ప్రోత్సాహం, గ్రామీణ విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి గొట్టిపాటి రవికుమార్ కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి, డైరెక్టర్ టెక్నికల్ ఆవుల మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెకట్స్ హెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్ వెంకటేశ్వర్లు, సీజీఎంలు, జీఎంలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.













# పోషక ఆహార ప్రాముఖ్యత పై అవగాహన

**సూపర్‌వైజర్ తారాభి**

**నందిగామ, సెప్టెంబర్ 16(మనం న్యూస్):** ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని నందిగామ మండలం లోని అంగన్వాడీ కేంద్రాల్లో తొమ్మిదవ జాతీయ పోషణ మాస ఉత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని చందాపురం కొణతమాత్మకూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీవో లక్ష్మీ భార్గవి పర్యవేక్షణలో సూపర్వైజర్లు శ్రీలత,తారబీలు చిరుధాన్యాలు ఆకుకూరలు పాలు గుడ్లు పోషక విలువలు కలిగిన ఆహారాలు తీసుకోవటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భవతులు బాలింతలు తో పాటు పిల్లలు కు వేడివేడిగా భోజనం తయారీ వడ్డింపు పై ప్రత్యక్ష ప్రదర్శన నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత అంగనవాడి కేంద్రంలో ఆటపాటలు తోపాటు ఫ్రీ ప్రైమరీ పిల్లలకు పిపి1 పిపి2 పుస్తకాల చదవటం , వ్రాయటం పలు అంశాలపై పోషణ మాసోత్సవాల్లో అవగాహన కల్పించారు.. చందాపురం అంగన్వాడి కేంద్రంలో వైద్యురాలు గౌతమి గర్భవతులు బాలింతలు తల్లులకు తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు గురించి, ఆహార నియమాలు గురించి వివరించారు.. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు తల్లులు గర్భవతులు బాలింతలు పాల్గొన్నారు... నందిగామ పట్నంలోని అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు..



# నేడు నల్లమలలో ఉచిత మెగా వైద్య శిబిరం



- **పారంభించనున్న కలెక్టర్**
- **సేవా సంకల్ప్ అభియాన్లో భాగంగా కొర్రపోలు తండాలో వైద్య సేవలు**
- **బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి**

**మార్కాపురం,సెప్టెంబర్,16,(మనం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మార్కాపురం జిల్లా దోర్నాల మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన కొర్రపోలు తండాలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. లీ ఫౌండేషన్, ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరం ద్వారా నల్లమల అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు, మారుమూల గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, వైద్యుల సలహాలు, అవసరమైన మందులను అందించనున్నారు. ఈ కార్యక్రమాన్ని మార్కాపురం జిల్లా కలెక్టర్ విజయ సునీత ప్రారంభించనున్నారు. జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, ఆర్డీవో శివరామిరెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో పాటు కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అంత్యోదయ స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తికి కూడా సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఏలూరి లక్ష్మీదేవి చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రరెడ్డి తెలిపారు.. మారుమూల నల్లమల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండే పరిస్థితులు తక్కువగా ఉంటాయని, అందుకే ప్రజల వద్దకే వైద్య సేవలను తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కొర్రపోలు తండాలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని పేదలు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలు, అట్టడుగు స్థాయి ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. మోదీ సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలను నిర్వహించడమే ఆయన జన్మదినోత్సవానికి నిజమైన స్ఫూర్తిదాయకమైన వేడుక అని తెలిపారు. నల్లమల ప్రాంతంలోని గిరిజన కుటుంబాలకు వైద్య సేవలు అందించడంతో పాటు, ఆరోగ్యంపై అవగాహన కల్పించడమే ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పురపాలక ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలి

**▶▶ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ,సెప్టెంబర్,16,(మనం న్యూస్): పురపాలక ఎన్నికల ఏర్పాట్లను వేగవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో రానున్న పురపాలక ఎన్నికల నేపథ్యంలో శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో డివిజన్ల సంఖ్యను 86కు పెంచుతూ గెజిట్ నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తదుపరి చేపట్టాల్సిన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాలను సిద్ధం చేసి, ఫోటో ఎలక్టోరల్ రోల్సు సెప్టెంబర్ 22, 2026 నాటికి ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రచురించిన ఓటర్ల జాబితాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండేలా సంబంధిత కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ఓటర్ల జాబితాకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వాటిని ఎన్నికల ద్వారా మార్కింగ్ చేయడంతో పాటు, ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల పూర్తి వివరాలతో నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తయిన వెంటనే అక్కడ అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు సమకూర్చేలా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. జోనల్ కమిషనర్లు తమ పరిధిలోని డివిజన్లలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి పనిని నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. మిడ్ లెవెల్ అధికారులుగా జోనల్ కమిషనర్లు తమ పరిధిలోని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన చోట వేగవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జనరల్ ఏ. రవీంద్రరావు, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఎస్. శ్రీధర్, అసిస్టెంట్ కమిషనర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి, ఆర్.ఎఫ్.ఓ సి.హెచ్. రత్నబాబు, ఎలక్షన్ డీటీలు సురేష్ కుమార్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేయాలి

**▶▶ ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



గుంటూరు పశ్చిమ సెప్టెంబర్: 16 (మనంప్రతినిధి): రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ రెండు ఏళ్లలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశాం కాబట్టి గర్వంగా ప్రజలను ఓటు అడుగుదామని,దానికి పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యకర్తల గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి, పార్టీ శ్రేణుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ డివిజన్లకు చెందిన కార్యకర్తలు తమ ప్రాంతాల్లోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ. గతంలో వైసీపీ కార్పొరేటర్లు అభివృద్ధిని,ప్రజలను విస్మరించి, దోపిడికి పాల్పడ్డారని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. రహదారులు, డ్రైనేజీ, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ రెండు ఏళ్లలోనే ఎన్నో చేశాం గర్వంగా ఓటు అడుగుదాం అని,ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేసేలా పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# నందిగామ పట్టణానికి రూ.22 కోట్లకు పైగా ప్రగతి వరం



**▶▶ సుమారు రూ. 3 కోట్లతో అత్యాధునిక నూతన మున్సిపల్ కార్యాలయ భవనం**

**▶▶ 15 కి.మీ.కు పైగా నూతన సీసీ రోడ్లు, గాంధీ సెంటర్**

**▶▶ రామన్నపేట మార్గంలో సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్**

**▶▶ రైతుపేట గోవర్ధన్ గార్డెన్స్‌లో అర ఎకరంలో పబ్లిక్ పార్క్, మెరుగైన తాగునీటి సరఫరా పనులు**

**▶▶ వెలుగుల బాటలో నందిగామ ప్రజలతో శుభవార్త పంచుకున్న ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య**

నందిగామ, సెప్టెంబర్ 16(మనం న్యూస్): గ్రేడ్-1 హోదాతో నూతన శోభ సంతరించుకున్న మన నందిగామ పురపాలక సంఘం ఇప్పుడు ప్రగతి పథంలో మరో కీలక ఘట్టానికి నాంది పలుకుతోందని ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణ స్వరూపాన్నే మార్చే ₹22 కోట్లకు పైగా విలువైన పనులు టెండర్ దశకు చేరుకున్నాయని చెప్పారు. ఈ పనుల పూర్తి వివరాలను మున్సిపల్ అధికారులు బుధవారం ఆమెకు అందజేశారు. ఆ శుభవార్తను ఆమె ప్రజలతో సంతోషంగా పంచుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో ఆర్టీ నం.1067 ద్వారా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద నందిగామ మున్సిపాలిటీకి ₹19 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు టెండర్లు పిలవడం పూర్తయింది, ఈ నెల 22న వాటిని తెరవనున్నారు. ఈ నిధులతో రూపుదిద్దుకోనున్న పనులు ఇవీ: నూతన మున్సిపల్ భవనం: ప్రజలకు అవసరమైన సేవలన్నీ ఒకే గొడుగు కింద అందేలా, సుమారు ₹3 కోట్లతో అత్యాధునిక పాలనా భవనం. విస్తృత సీసీ రోడ్లు: పట్టణంలోని వివిధ వార్డుల్లో 15 కిలోమీటర్లకు పైగా సుదృఢమైన సీసీ రహదారుల నిర్మాణం. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్: గాంధీ సెంటర్ నుంచి రామన్నపేట వెళ్లే ప్రధాన మార్గంలో (15, 16 వార్డుల పక్కనుంచి) సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు. పబ్లిక్ పార్క్: రైతుపేటలో గల గోవర్ధన్ గార్డెన్స్ నందు అర ఎకరం విశాల ప్రాంగణంలో పార్క్. చిన్నారులకు కేరింతలు, పెద్దలకు ప్రశాంతతనిచ్చే హరిత వేదికగా ఉంటుంది. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం నిధులు ₹3.40 కోట్లతో మరిన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయి. వాటిలో వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు ఉన్నాయి. తాగునీటి సరఫరా మెరుగుకు నూతన పంపింగ్ పైప్లైన్లు, మునేరు వద్ద కొత్త కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, 'మురుగిట మురిసే కొత్త రోడ్లు, ప్రధాన రహదారిపై వెలుగులు, చిన్నారుల నవ్వులు వినిపించే పార్క్, ప్రజాసేవకు నిలయమయ్యే నూతన భవనం. నందిగామ ప్రజలు ఎన్నాళ్లుగానో కంటున్న కల ఇప్పుడు కార్యరూపం దాల్చుతోంది. మన నందిగామ వెలుగులతో నిండిపోతుంటే ఒక ప్రజాప్రతినిధిగా నా మనసు అపారమైన ఆనందంతో నిండిపోతోంది' అని హర్షం వ్యక్తం చేశారు. ఈ రెండేళ్లలో ఒకవైపు నిర్మాణ దశలో సాగుతున్న ప్రాజెక్టులు ఉన్నాయి. మరోవైపు టెండర్ల దశకు చేరి త్వరలోనే ప్రారంభం కానున్న ఈ నూతన పనులు ఉన్నాయి. మాటల్లో కాక ఆచరణలో కనిపిస్తున్న వికాసానికి ఇవే సజీవ సాక్ష్యాలని ఆమె స్పష్టం చేశారు. నందిగామ సమగ్రాభివృద్ధికి నిరంతరం అండగా నిలుస్తున్నవారికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు: గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ. మంజూరైన ప్రతి పనినీ అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తయ్యేలా స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. 'అభివృద్ధి అంటే కేవలం అంకెలు కావు... ప్రజల జీవితాల్లో నిండే వెలుగు. ఆ వెలుగు ఇప్పుడు నందిగామలోని ప్రతి వీధికీ, ప్రతి ఇంటికీ చేరబోతోంది' అని సౌమ్య తెలిపారు.

# డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం




**▶▶ మాజీ మంత్రి దేవినేని ఉమా**

గొల్లపూడి,సెప్టెంబర్ 16(మనం న్యూస్): మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మంత్రి నారా లోకేష్కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గొల్లపూడి లోని కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను అవమానించేలా, వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 892 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని కూడా ఓర్వలేకపోతున్నారని అన్నారు. మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాలతో ట్వీట్లు చేస్తున్న జగన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. పట్టిసీమ నీటితో జరిగిన మేలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేయాలని ఉమా డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు జస్టిస్ గురించి మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. స్పోర్ట్స్‌కోటాలో డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిలో 372 మందికి నియామకాలు లభించగా, వారిలో 326 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారేనని దేవినేని ఉమా తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన గణేష్ బోడెన్నీ సరస్సును ఈది ప్రపంచ రికార్డు సృష్టించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అదేవిధంగా పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి డీఎస్సీ ఉద్యోగం సాధించిన రవికుమార్ తన ఏడాది జీతాన్ని గ్రామం కోసం, పేదల కోసం అందించి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు హామీలు ఇచ్చి మోసం చేసిన జగన్‌రెడ్డికి డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదని దేవినేని ఉమా అన్నారు. రాష్ట్రంలో జరిగిన 14 డీఎస్సీల ద్వారా 1,80,000 టీచర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదే అని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుంటే ఓర్వలేక మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కుట్రలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పనున్నారని దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు.

# నార్కోటిక్ డ్రగ్స్ నిల్వ భవన నిర్మాణాన్ని పరిశీలించిన కలెక్టర్ డీకే బాలాజి



**▸▸ నెలాఖరులోగా నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి**

**మచిలీపట్నం, సెప్టెంబరు 16 (మనం న్యూస్):** జిల్లాలో పోలీసులు స్వాధీనం చేసుకునే డ్రగ్స్ ను భద్రంగా నిల్వ చేసేందుకు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న నార్కోటిక్ డ్రగ్స్ సైకోట్రోపిక్ సబ్బాన్సెస్ (ఖ్యాఖి) భవనాన్ని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి బుధవారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణ పనులు, భద్రతా ప్రమాణాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను పరిశీలించారు. స్వాధీనం చేసుకున్న నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి తదితర మాదకద్రవ్యాలను న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రంగా నిల్వ చేయడంతో పాటు, అనంతరం నిబంధనల మేరకు వాటిని నిర్వీర్యం చేసే ప్రక్రియకు ఈ భవనం ఉపయోగపడుతుందని, భద్రత ప్రమాణాలు పాటిస్తూ నిబంధనలు మేరకు నిర్మించాలని సూచించారు. పాత 13 జిల్లాలకు మంజూరైన ప్రత్యేకఖ్యాఖి స్టోరేజ్ భవనాల్లో భాగంగా కృష్ణా జిల్లాకు ఈ భవనం మంజూరైనట్లు అధికారులు తెలిపారు. భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు కాగా, ప్రత్యేక భద్రతా ప్రమాణాలతో సుమారు 650 చదరపు అడుగుల విస్తీర్ణంలో స్ట్రాంగ్ రూమ్ తరహాలో నిర్మిస్తున్నట్లు వివరించారు. భవన నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట ఏఎస్పి వీవీ నాయుడు, రహదారులు భవనాల శాఖ కార్యనిర్వాహక అధికారి లోకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

# శివాలయ కోనేరు పరిరక్షణ దీక్షలకు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నందిగామ సంపూర్ణ మద్దతు

**నందిగామ,సెప్టెంబర్ 16(మనం న్యూస్):** నందిగామ శ్రీ శుక శ్యామలాంబ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థాన పవిత్ర కోనేరు (శ్రీ పుష్కరిణి) స్థల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ గత కొన్ని నెలలుగా సాగుతున్న ఉద్యమానికి 'ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్' సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. ఈ పోరాటంలో భాగంగా ఈ నెల 18న (శుక్రవారం) అసోసియేషన్ సభ్యులందరూ ప్రత్యక్షంగా నిరాహార దీక్షలో పాల్గొననున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు అనుమోలు వెంకట శ్రీనివాసరావు వెల్లడించారు. కోనేరు స్థలాన్ని ఆక్రమణల నుండి విముక్తి చేయాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, స్థానిక అధికారులు తీవ్ర నిర్లక్ష్యంతో, మొండి వైఖరి ప్రదర్శిస్తుండటం గర్హనీయమన్నారు. ఆలయ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రజాసంఘాలు, భక్తులు చేపట్టిన నిరసనలు నేటితో 9వ రోజు నిరాహార దీక్షకు చేరినా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమని మండిపడ్డారు. ఈ పవిత్ర ఉద్యమానికి రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, పట్టణ ప్రజలు పెద్ద ఎత్తున మద్దతు పలకాలని




ఆయన విజ్ఞప్తి చేశారు. అధికారుల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు శివాలయ ప్రాంగణంలో జరిగే నిరాహార దీక్షలో వ్యాపారస్థులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొని దీక్షను విజయవంతం చేస్తారని తెలిపారు. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి కోనేరు ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రముఖులు మహంకాళి వెంకటేశ్వర రావు, లింగమల్లు నాగేశ్వర రావు, దూపగుంట్ల వెంకటేశ్వర రావు, పారేపల్లి బెనర్జీ, పాదర్తి విశ్వేశ్వర రావు, రాజు, మరియు పలువురు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు

# పార్టీల ప్రజా ప్రతినిధులతో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోసమావేశం



**నందిగామ,సెప్టెంబర్ 16(మనం న్యూస్):** నందిగామ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.వి. ఎస్.హెచ్.వి.యం. ప్రసాదరావు ఏ.పి.స్టేట్ ఎలక్షన్ కమిషనర్ వారి ఆదేశాలను అనుసరించి 2వ సాధారణ ఎన్నికలు ఎంపిటిసీ/జెడ్పిటిసీ 2026 లో భాగంగా నందిగామ మండలంలో 23 గ్రామాలలో ఏర్పాటు చేసిన 47 పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, క్లెయిమ్స్ పై చర్చించుటకు గాను బుధవారం ఉదయం 11:00 గంటలకు మండల పరిధిలోని అన్నీ పార్టీల ప్రజా ప్రతినిధులతో మరియు నేతలతో మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు అఖిలపక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. సదరు 47 పోలింగ్ కేంద్రంలకు సంబంధించి ఏ పార్టీ నుండి ఎటువంటి అభ్యంతరాలు వచ్చియుండ లేదు అని వి.ఎస్.హెచ్.వి.యం. ప్రసాదరావు తెలిపారు.

# ఆయిల్‌ఫామ్ సాగుతో రైతుల ఆదాయం పెంపు



**▸▸ ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**

**▸▸ రైతులకు కలెక్టర్ డీకే బాలాజీ పిలుపు**

**బాపులపాడు, సెప్టెంబరు 16 (మనం న్యూస్):** సంప్రదాయ పంటలతో పోలిస్తే రైతులకు మెరుగైన, నిరంతర ఆదాయాన్ని అందించే ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని, కృష్ణా జిల్లాలో ఆయిల్పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని రైతులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి పిలుపునిచ్చారు.బుధవారం బాపులపాడు మండలం సీతారాంపురం గ్రామంలో రైతు మద్ది శ్రీనివాసరావు సాగు చేస్తున్న ఆయిల్పామ్ తోటను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. గతంలో వరి సాగు చేసిన భూమిలో ఆయిల్పామ్ సాగును చేపట్టిన రైతుతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి సాగు విధానం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అంతర పంటల సాగు, దిగుబడి, మార్కెటింగ్ తదితర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కృష్ణా జిల్లాలోని వాతావరణం, భూముల పరిస్థితులకు అనుకూలంగా ఉన్న ఆయిల్పామ్ సాగును రైతులు ప్రత్యామ్నాయ పంటగా పరిశీలించాలని సూచించారు. సంప్రదాయ పంటలైన వరి, మినుములు తదితర పంటల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే, ఆయిల్పామ్ ద్వారా దీర్ఘకాలికంగా, క్రమం తప్పకుండా ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.ఆయిల్పామ్ సాగు చేపట్టే రైతులకు ప్రభుత్వం వివిధ రకాల రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని కలెక్టర్ తెలిపారు. మొక్కల నాటే సామగ్రి కోసం సుమారు రూ.29,500 వరకు, మొదటి నాలుగు సంవత్సరాల్లో ఇతర నిర్వహణ ఖర్చుల కోసం రూ.10,500 వరకు, బోర్వెల్ కోసం రూ.50 వేలు పంపుసెట్ కోసం రూ.10 వేలు వరకు ప్రభుత్వ సహాయం అందిస్తున్నట్లు వివరించారు.ఆయిల్పామ్ గెలలు దిగుబడికి వచ్చిన తర్వాత మార్కెటింగ్ విషయంలోనూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఆయిల్పామ్ కొనుగోలు చేసే సంస్థలు ప్రతి 15 రోజులకు ఒకసారి రైతుల పొలాల వద్దకు వచ్చి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయని తెలిపారు. దీంతో రైతులకు క్రమం తప్పకుండా ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతు మద్ది శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆయిల్పామ్ తోట ప్రారంభ దశలో అంతర పంటగా మొక్కజొన్న సాగు చేసుకుంటూ ఆదాయాన్ని కొనసాగించామని కలెక్టర్కు వివరించారు. భవిష్యత్తులో ప్రతి 15 రోజులకు ఒకసారి ఆయిల్పామ్ ద్వారా ఆదాయం వచ్చే అవకాశం ఉండటంతో ఇతర పంటల మాదిరిగా ఏడాదికి ఒకసారి ఆదాయం కోసం ఎదురుచూడాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ విధానాన్ని జిల్లాలోని ఇతర రైతులు కూడా ఆదర్శంగా తీసుకుని తమ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఆయిల్పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆయిల్పామ్ సాగుకు సంబంధించిన ప్రభుత్వ రాయితీలు, సాంకేతిక సహాయం తదితర అంశాల్లో రైతులకు అవసరమైన సహకారం అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. కలెక్టర్ వెంట ఉద్యానవన శాఖ అధికారిణి జె జ్యోతి తదితరులు ఉన్నారు.

# విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**▸▸ నారా లోకేష్ నేతృత్వంలో విద్యారంగానికి మహర్దశ**

**▸▸ దాతల సేవలు అభినందనీయం**

**▸▸ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**చందర్లపాడు,సెప్టెంబర్ 16(మనం న్యూస్):** విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమని, ఆయన ఆధ్వర్యంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. చందర్లపాడు మండలం కోనాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో రూ.3.50 లక్షల వ్యయంతో దాత డాక్టర్ ప్రియాంక సుబ్బారావు సహకారంతో నిర్మించిన 'చేకూరి హేమలత' నూతన భోజనశాలను కూటమి నేతలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ విద్యార్థుల కోసం భోజనశాల నిర్మాణానికి ముందుకు వచ్చిన డాక్టర్ ప్రియాంక సుబ్బారావుని అభినందించారు. సమాజం నుంచి పొందిన దానిని సమాజానికే తిరిగి అందించాలనే సేవాభావంతో దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, దాతలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ తమకు సాధ్యమైన మేరకు విద్యార్థులు, పాఠశాలలు, గ్రామాల అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు



**మొక్క నాటడం కాదు బాధ్యతను నాటాలి**

పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలని సూచించారు. పచ్చని వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని అన్నారు. కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తోందని, ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు దాతల సేవాభావం తోడైతే పాఠశాలల రూపురేఖలు మరింతగా మారుతాయని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, కూటమి నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మహేష్ బాబుతో కొనసాగనున్న 'డాలర్ బిగ్‌బాస్' ప్రయాణం



Dollar BigBoss Extends Association with Superstar Mahesh Babu for the South Indian Market

## ▸▸ త్వరలో సరికొత్త టీవీ ప్రకటన చిత్రీకరణ ప్రారంభం

**గుంటూరు, సెప్టెంబర్ 2026(మనంప్రతినిధి):** దేశీయ హోసియరీ రంగంలో అగ్రగామి 'డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్' దక్షిణాది మార్కెట్కు 'డాలర్ బిగ్బాస్' బ్రాండ్ అంబాసిడర్గా ప్రముఖ సినీ నటుడు,సూపర్ స్టార్ మహేష్ బాబుతో తమ భాగస్వామ్యాన్ని పొడిగించింది. ఈ సందర్భంగా డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ కుమార్ గుప్తా మాట్లాడుతూ దక్షిణాది మార్కెట్లోకి డాలర్ ఉత్పత్తులను 2024లో ప్రవేశపెట్టామని, మా ఉత్పత్తులకు విశేష ఆదరణ లభించిందని తెలిపారు.డాలర్ బిగ్బాస్ బ్రాండ్ అంబాసిడర్గా సూపర్ స్టార్ మహేష్ బాబుతో ఏర్పడిన అనుబంధం మా బ్రాండ్కు ఎంతో ఉపయోగపడిందన్నారు. అందుకే ఆయనతో ఈ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నా మన్నారు. త్వరలోనే ఆయనతో కూడిన సరికొత్త వాణిజ్య ప్రకటనను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని తెలిపారు.దక్షిణాది మార్కెట్ కోసం ప్రత్యేకంగా రూపొందిస్తున్న ఈ సరికొత్త టెలివిజన్ ప్రకటనలో మహేష్ బాబు డైనమిక్ లుక్లో కనిపించనున్నారన్నారు. అన్ని వేళలా,అన్ని వాతావరణ పరిస్థితుల్లో 'ధృడత్వం, నమ్మకం, స్టైల్' అందించే బ్రాండ్ తత్వాన్ని ఈ ప్రకటన ప్రతిబింబించనుందని పేర్కొన్నారు. డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ గురించి 'డాలర్' ఒక సాధారణ హోసియరీ బ్రాండ్గా ప్రస్థానం ప్రారంభించింది.నేడు ఇన్నర్వేర్ విభాగంలో అగ్రగామిగా ఎదిగింది. భారతదేశంలో ప్రముఖ హోసియరీ,దుస్తుల తయారీ దిగ్గజాలలో ఒకటిగా నిలిచింది. ప్రాథమిక లోదుస్తుల నుంచి ఔటర్వేర్ వరకు అన్ని రకాల దుస్తులను అందిస్తుంది. ఈ విజయ ప్రస్థానం వెనుక అంకితభావం, తెగువతో పాటు ఎదురీదే ఆత్మవిశ్వాసం దాగి ఉన్నాయి.మారుతున్న పోకడలు ,వినియోగదారుల సంతృప్తే పరమావధిగా నిరంతరం పని చేస్తుంది. అధునాతన ఉత్పత్తుల ద్వారా ధర, నాణ్యత,ఉత్పాదకతల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను సాధించడంపై దృష్టి సారించింది.ప్రతీదీ ఎప్పటికప్పుడు సరికొత్త ఫ్యాషన్కు అనుగుణంగా ఉంటుంది.నాణ్యత, సరసమైన ధరలకు మారుపేరుగా నిలిచిన'డాలర్' ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారుల నమ్మకాన్ని గెలుచుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో తనదైన ముద్ర వేసింది. దేశవ్యాప్తంగా విస్తృతమైన నెట్వర్క్ కలిగి ఉంది. గత కొన్నేళ్లుగా యుఏఈ, ఒమన్, జోర్డాన్, ఖతార్, కువైట్, బహ్రెయిన్, యెమెన్, ఇరాక్, నేపాల్, సూడాన్ వంటి విదేశీ మార్కెట్లలోనూ పట్టు సాధించింది. కొన్నేళ్ల క్రితమే ఎన్ఎస్ఈ,బీఎస్ఈలలో నమోదైంది. ఆర్గనైజ్ ఇన్నర్వేర్ మార్కెట్లో దాదాపు 15 శాతం వాటాను కలిగి ఉన్న డాలర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ దేశంలోనే పూర్తిస్థాయి ఇంటిగ్రేటెడ్ తయారీ కేంద్రాన్ని కలిగిన మొదటి ఇన్నర్వేర్ సంస్థగా గుర్తింపు పొందింది.మరింత సమాచారానికి దయచేసి సంప్రదించండి : 9959154371 / 9963980259

# సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యం..

## ▸▸ క్షేత్రస్థాయిలో విజిబుల్ పోలీసింగ్ను మరింత పటిష్టం చేస్తున్నాం
## ▸▸ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు సెప్టెంబర్: 16( మనం న్యూస్ ప్రతినిధి ):** గుంటూరు జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతలను పరిరక్షిస్తూ సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్ను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ తెలిపారు.ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాలు,ఆసుపత్రులు, బ్యాంకులు,బస్టాండ్లు, విద్యాసంస్థలు,ఇతర సున్నిత ప్రాంతాల్లో పోలీస్ అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి ప్రతిరోజూ విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నారు. ప్రజల్లో భద్రతా భావాన్ని మరింత పెంపొందించడంతో పాటు గణేష్ ఊరేగింపుల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పగలు,రాత్రి ప్రత్యేక పోలీస్ బృందాలతో విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.అనుమానాస్పద కదలికలు, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.బ్యాంకులు, వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు, దోపిడీలను నివారించేందుకు,విద్యాసంస్థల పరిసరాల్లో ఈవ్టీజింగ్,ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అదేవిధంగా అల్లర్లు,గొడవలు, అక్రమ నిర్బంధాలు, కిడ్నాప్లు,మానవ అక్రమ రవాణా వంటి నేరాలను నిరోధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కీలక ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తూ వాహనాల దొంగతనాలు, గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడుతున్నారు.అనుమానిత వాహనాలు,వ్యక్తుల వివరాలను సేకరించి అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిశీలిస్తున్నారు.రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను సేకరించి,సీసీటీఎన్ఎస్ మరియు పోలీస్ శాఖ డేటాబేస్ ద్వారా వారి పూర్వ నేర చరిత్రను పరిశీలిస్తున్నారు. గుంటూరు నగరం మరియు జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలను ఎస్పీ వకుల్ జిందాల్,ఐపీఎస్ స్వయంగా పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో అదనపు నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.ఇప్పటికే జిల్లాలోని పలువురు రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితుల కదలికలపై ఖఖీఎఖి, అఐ ఇఖీ౧ 360 వంటి సాంకేతిక వ్యవస్థల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతోంది. అవసరమైన సందర్భాల్లో డ్రగ్ టెస్టులు నిర్వహిస్తూ,మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించే వారిని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపీఎస్ హెచ్చరించారు. ప్రజల భద్రత - పోలీసుల ప్రథమ కర్తవ్యం. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా నిరంతరం పోలీసుల సేవలు అందుబాటులో ఉంటాయని ఎస్పీ గారు తెలిపారు.

# స్వర్గపురిలో పచ్చదనం, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం

## ▸▸ విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర



**విజయవాడ,సెప్టెంబర్,16,(మనం న్యూస్):** స్వర్గపురిలో పచ్చదనం పెంచి, పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా కృష్ణలంకలోని స్వర్గపురిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్వర్గపురిలోని మౌలిక వసతులు, పారిశుధ్య నిర్వహణ, మరుగుదొడ్లు, స్నానపు గదులు తదితర సౌకర్యాలను కమిషనర్ పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ స్వర్గపురిలో వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని వసతులను సమకూర్చాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వాటి నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. స్వర్గపురి పరిసరాల్లో గ్రీనరీని మరింత పెంచాలని, స్వర్గపురిలో వసతుల నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా సంబంధిత విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ కె. షమీ, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణమూర్తి, రామారావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కౌన్సిలర్ స్వర్ణలతను పరామర్శించిన ప్రభుత్వ విప్ తంగిరాల



**నందిగామ,సెప్టెంబర్ 16(మనం న్యూస్):** నందిగామ పట్టణం రైతు పేట నందు మాజీ వార్డు కౌన్సిలర్ శాఖమూరి స్వర్ణలత మోకాలు శాస్త్ర చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకొనుచుండగా కూటమి నేతలతో కలిసి ఆమెను వారి స్వగృహంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కలిసి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

# పలువురు తెదేపా నేతల కుటుంబాలకు ఎమ్మెల్యే సౌమ్య పరామర్శ





**చందర్లపాడు,సెప్టెంబర్ 16(మనం న్యూస్):** చందర్లపాడు మండలంలో కూటమినేతలతో కలిసి బుధవారం నాడు కొనయపాలెం గ్రామంలో పర్యటించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇటీవల కాలంలో గ్రామంలో మరణించిన తెదేపా నేతల కుటుంబాలను పరామర్శించారు. ఈ మేరకు మాజీ వైస్ ప్రెసిడెంట్ వనపర్తి వెంకటేశ్వర్లు, గొణుగుంట్ల వేంకటేశ్వర రావు,తొర్లికొండ పద్మావతి, కళ్యాణపు నాగేశ్వరరావు,మొండితోక మరియమ్మ, జువ్వ విల్సన్ రావు, ఉలవలపుడి నాగేంద్రమ్మ, నవీన్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆ దేవుడు వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని కలగజేయాలని తెలియజేశారు.





నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు.
- గుంటూరు పశ్చిమ,మనం న్యూస్ ప్రతినిధి

# గణనాథుడికి ప్రత్యేక పూజలు అన్నదానం
## నిర్వహించిన మున్సిపల్ కౌన్సిలర్ వట్టేం మనోహర్



**పెనుగంచిప్రోలు సెప్టెంబర్ 16 మనం న్యూస్:** పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు గ్రామంలోని వినాయక మండపం వద్ద గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవ కమిటీ.వారి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గయ్యపేట మున్సిపల్ కౌన్సిలర్ వట్టేం మనోహర్ , వారి వ్యక్తిగత వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మనోహర్ తో పాటు రాష్ట్ర వైసీపీ అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్ , రాష్ట్ర వైసీపీ ఎస్టీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి లాహోరీ బద్దు నాయక్ , మరియు జగ్గయ్యపేట వైసిపి నాయకులు గంగోలు వినోద్, గడ్డిపర్తీ రాజేష్ మరియు గ్రామవైఎస్ఆర్సిపి నాయకులు బైసు కృష్ణమూర్తి, కనపర్తి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ,సెప్టెంబర్,16,(మనం న్యూస్):** ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో స్వచ్ఛత సేవా కార్యక్రమంపై శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ, సెప్టెంబర్ 17, 2026 నుంచి అక్టోబర్ 17, 2026 వరకు నిర్వహించనున్న స్వచ్ఛత సేవా కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నెల రోజుల పాటు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. స్వచ్ఛత సేవా కార్యక్రమం ద్వారా నగరంలోని ప్రతి ప్రాంతంలో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు, ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వాములను చేసి స్వచ్ఛతను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమంలో అధికారులు, సిబ్బందితో పాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమం ఒక ప్రత్యేక సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలని, స్వచ్ఛత పట్ల ప్రతి ఒక్కరిలో బాధ్యతాభావాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగరాన్ని మరింత పరిశుభ్రంగా, పచ్చగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు, చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, పర్యవేక్షణ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జోనల్ కమిషనర్లు శ్రీనివాస్, ప్రభుదాస్, షమ్మీ, జోనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.











ఎన్టీఆర్ జిల్లా నందిగామ వాసవి మార్కెట్ లో ఏర్పాటు చేసిన గణనాధుడిని దర్శించుకున్న జర్నలిస్టు సంఘ జాతీయ నాయకులు పి.మీరాహుస్సేన్ ఖాన్ తదితర సీనియర్ జర్నలిస్టులుగణేషుడి అశీస్సులు అందరిపై ఉండాలని అకాంక్షించారు. వాసవి మార్కెట్ లో గత 44సంవత్సరాలుగా అత్యంత వైభవంగా వినాయకచవితి ఉత్సవాలు.నిర్వహకులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపిన జర్నలిస్టులు.ఈ సందర్భంగా జర్నలిస్టులను కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# నందిగామ వాసవి మార్కెట్లో 44 సంవత్సరాలుగా ఘనంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు

**పెద్ద ఎత్తున గణేషుడిని దర్శించుకుంటున్న భక్తులు**

**నందిగామ, సెప్టెంబర్ 16(మనం న్యూస్):** నందిగామ పట్టణంలోని వాసవి మార్కెట్ లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక వ్యాపారస్తులు, వాసవి క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో భారీ వినాయక మండపాన్ని ఏర్పాటు చేశారు.గత 44సంవత్సరాలుగా వినాయకచవితి ఉత్సవాలు అత్యంత భక్తి శ్రద్ధలతో ఎంతో పవిత్రంగా నిర్వహిస్తున్నారు.ప్రతి ఎటా ఎదో ఒక ప్రత్యేకతను సంతరించుకునే విధంగా గణనాధుడిని ఏర్పాటు చేస్తారు. వాసవి మార్కెట్ లో ఏర్పాటు చేసిన గణేషుడిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు ఈ సందర్భంగా ఉదయం గణపతికి ప్రత్యేక పూజలు, పాలాభిషేకం నిర్వహించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. తొమ్మిది రోజుల పాటు రోజూ ఉదయం, సాయంత్రం పూజలు చివరి రోజున భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏచూరి రామకృష్ణా( రాము),జి.పెద్దిరాజు ,చిన్నారి,బలరామకృష్ణా. మార్కెట్, వ్యాపారస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని వారు తెలిపారు.








# హాస్టళ్లలో పారిశుద్ధ్య లోపాలపై నోటీసులు

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జరిమానా**

**విజయవాడ,సెప్టెంబర్, 16,(మనం న్యూస్):** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు నగరంలో హాస్టళ్లలో పారిశుద్ధ్య ప్రమాణాలు, వ్యర్థాల నిర్వహణ, వాణిజ్య లైసెన్సులపై అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 23వ డివిజన్ సూర్యారావుపేట ప్రాంతంలో బుధవారం హాస్టళ్లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో రెండు హాస్టళ్లలో పారిశుద్ధ్య లోపాలను అధికారులు గుర్తించారు. ఒక హాస్టల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా నిర్వహించకపోవడాన్ని, మరో హాస్టల్లో వంటగదిలో పరిశుభ్రత ప్రమాణాలు సక్రమంగా పాటించకపోవడాన్ని గుర్తించి, సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. హాస్టళ్లలో మరుగుదొడ్లు, వంటగదులు, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ఒక హాస్టల్లో సింగిల్ యూజ్ క్యారీ పౌచ్లను వినియోగిస్తున్నట్లు గుర్తించడంతో సంబంధిత నిర్వాహకులకు రూ.2,000 జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. మరో రెండు హాస్టళ్లు నగరపాలక సంస్థ నుంచి డిఓ ట్రేడ్ లైసెన్స్ పొందకుండా నిర్వహిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. దీంతో సంబంధిత హాస్టళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ పొందాలని అధికారులు ఆదేశించారు. నగరంలోని హాస్టళ్ల నిర్వాహకులు పారిశుద్ధ్య



ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని, అవసరమైన ట్రేడ్ లైసెన్సులు పొందాలని కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. నిబంధనల ఉల్లంఘనలపై నగరవ్యాప్తంగా తనిఖీలు కొనసాగుతాయని, లోపాలు గుర్తించిన సంస్థలపై నిబంధనల మేరకు నోటీసులు, జరిమానాలు తదితర చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో సానిటరీ సూపర్వైజర్ సలీం అహ్మద్ సానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

# పామర్రులో ఘనంగా పోషణ మాసోత్సవాలు

**సూపర్‌వైజర్ సత్యశ్రీ**

**పామర్రు, సెప్టెంబర్ 16 (మనం న్యూస్ ):** పామర్రు మండలం పామర్రు సెక్టార్ పరిధిలో బుధవారం పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ నూతక్కి సత్యశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు మరియు మహిళలకు పోషకాహారంపై ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సూపర్వైజర్ సత్యశ్రీ మాట్లాడుతూ,నిత్య జీవితంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు లభించే ఆహారాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సరైన పోషకాహారం తీసుకోవడం వల్ల మహిళలు, గర్భిణీలు రక్తహీనత (అనీమియా) బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన ఆహారంలో ఆకుకూరలు, తాజా కూరగాయలు, సీజనల్ పండ్లు మరియు చిరుధాన్యాలను (మిల్లెట్స్) భాగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలతో పాటు అంగన్వాడీ



కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు మరియు మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం




గుంటూరు, సెప్టెంబర్ 16(మనంప్రతినిధి) : విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రవాణా శాఖ ఉప కమిషనర్ కె.సీతారామిరెడ్డి తెలిపారు. గుంటూరులో గల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాలుగు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోడ్డు సంకేతాలు, పాఠశాల,కళాశాల బస్సుల భద్రత.యాజమాన్యం, డ్రైవర్లు, విద్యార్థులు, పాదచారుల భద్రతపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన అవసరం అన్నారు. రహదారులపై ప్రయాణించే సమయంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ను వినియోగించాలని సూచించారు .ద్విచక్ర వాహనాలు నడిపే విద్యార్థులు హెల్మెట్ ధరించడం,వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ ఉపయోగించకపోవడం, ట్రిపుల్ రైడింగ్ను దూరంగా ఉండడం వంటి భద్రతా చర్యలను పాటించాలని కోరారు. రోడ్లపై నడుస్తూ హెడ్ఫోన్లు, ఇయర్ఫోన్లు ఉపయోగించవద్దని విజ్ఞప్తి చేశారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాల రక్షణకు కూడా బాధ్యత వహించాలని,రోడ్డు భద్రతా నిబంధనలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని పేర్కొన్నారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత - జాగ్రత్తగా ప్రయాణిద్దాం, సురక్షితంగా ఇంటికి చేరుదాం అనే సందేశాన్ని ప్రతి విద్యార్థి పాటించాలని కోరారు. రోడ్డు దాటే ముందు కుడి-ఎడమ వైపు చూసి, వాహనాలు లేవని నిర్ధారించుకోవాలని అన్నారు. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు తొందరపడకుండా,వాహనం పూర్తిగా ఆగే వరకు వేచి ఉండాలని చెప్పారు. రోడ్లుపై పరుగెత్తడం,తోటి విద్యార్థులతో ఆటలాడడం చేయరాదని పేర్కొన్నారు. రాత్రి వేళలు లేదా తక్కువ వెలుతురు ఉన్న సమయంలో ప్రతిబింబించే దుస్తులు, ఉపకరణాలు ఉపయోగించడం మరింత శ్రేయస్కరం అన్నారు. ఇంటి నుంచి కుటుంబ సభ్యులు బయటకు వెళ్ళి వచ్చే వరకు ఇతర సభ్యులు చూస్తుంటారని,ప్రమాదాలు వంటి సంఘటనలు జరిగితే ఆ కుటుంబానికి తీరని ఆవేదన మిగులుతుందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 46 మంది కళాశాల బస్సు డ్రైవర్లకు డ్రైవర్ శిక్షణ రిఫ్రెషర్ కోర్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, కళాశాల అధ్యాపకులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పెద్ద ఎత్తున 'స్వచ్ఛతా హీ సేవా 2026'



గుంటూరు, సెప్టెంబర్ 16 (మనంప్రతినిధి): జిల్లాలో పెద్ద ఎత్తున 'స్వచ్ఛతా హీ సేవా 2026' కార్యక్రమాన్ని నిర్వహించుటకు సిద్ధమైనట్లు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. స్వచ్ఛతా హీ సేవా 2026'పై రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 'స్వచ్ఛతా హీ సేవా 2026' కార్యక్రమం సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించుట జరుగుతుందన్నారు. ఈ ఏడాది ప్రచార కార్యక్రమం 'స్వచ్ఛతా మెయిన్ సహభాగ్, స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్' అనే నినాదంతో 'హోల్ ఆఫ్ సొసైటీ''హోల్ ఆఫ్ గవర్నమెంట్' విధానంలో పౌరులు, సంస్థలు, నాయకత్వాన్ని ఏకతాటిపైకి తీసుకువచ్చే విధంగా రూపొందించడం జరిగింది.దీని పట్ల ఈ కార్యాచరణ ప్రణాళికను రూపొందించవ న్నారు. పరిశుభ్రత లక్ష్యం గల ప్రాంతాలలో మార్పు తీసుకురావడం, పరిశుభ్రమైన బహిరంగ ప్రదేశాలు, స్వచ్ఛ పాఠశాల - యువత భాగస్వామ్యం, సఫాయి మిత్ర సురక్ష ఏవం సమ్మాన్ శిబిరాలు,స్వచ్ఛత కోసం జన భాగీదారి స్వచ్ఛతా సే సమృద్ధి ప్రచారంలో భాగంగా జిల్లావ్యాప్తంగా మురికి, నిర్లక్ష్యానికి గురైన ప్రాంతాలను గుర్తించి నిర్ణీత గడువులోగా వాటిని పరిశుభ్రపరచడం, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు వ్యర్థాల యాజమాన్యంపై అవగాహన కల్పించడం, పారిశుధ్య కార్మికులకు (సఫాయి మిత్రలకు) ఆరోగ్య పరీక్షలు, రక్షణ పరికరాలు, సంక్షేమ పథకాల అనుసంధానంతో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం,ఇంటింటికీ అవగాహన కార్యక్రమాలు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, గృహ కంపోస్టింగును ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు.ఈ ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, స్వచ్ఛతను నిత్యజీవనంలో ఒక భాగంగా మలచుకోవాలని కోరారు. ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీన ఉదయం 8 గంటలకు దేశవ్యాప్తంగా 'ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాథ్' పేరుతో సామూహిక శ్రమదానం నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పౌరులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, యువజన సంఘాలు పెద్ద ఎత్తున పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ 2వ తేదీన 'స్వచ్ఛ భారత్ దివస్' సందర్భంగా గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామసభలు, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నిబంధనలు-2026పై అవగాహన కల్పించడంతోపాటు 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటలన్నారు. ప్రచార కార్యక్రమానికి సంబంధించిన రోజువారీ కార్యకలాపాలను ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 25న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం



గుంటూరు, సెప్టెంబర్ 16 : (మనం న్యూస్ ప్రతినిధి) జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై జిల్లా సమన్వయ సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం' లో బాగంగా జిల్లాలో గల 1 నుండి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల దాదాపు 4,62,714 మంది బాల బాలికలకు అంగన్వాడీ, ప్రభుత్వ , ఎయిడెడ్, ప్రైవేట్పాఠశాలలు, కళాశాలలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు, విద్యా సంస్థల బయట ఉన్న వారికి, కౌమార బాల బాలికలకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రాలను ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఈ మాత్రలు 1 సంవత్సరం నుండి 2 సంవత్సరాలు వయస్సు గల పిల్లలకు సగము మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలన్నారు. 2నుండి 3 సంవత్సరాల వయసు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలని, 3 నుండి 19 సంవత్సరాల వయసు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తరవాత మాత్రలను వేయాలని సూచించారు. విద్యాశాఖ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ,ఇతర శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. నులి పురుగుల నివారణ వలన రక్త హీనత వంటి సమస్యలను అధిగమించుటకు అవకాశం ఉందని గ్రహించాలని సూచించారు.ప్రతీ ఒక్కరికి నిర్దేశిత మోతాదులో ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె విజయ లక్ష్మి మాట్లాడుతూ మాత్రను చప్పరించడం వలన ఎటువంటి దుష్పరిణామాలు కలుగవని అన్నారు.25వ తేదీన తీసుకొనని వారికి అక్టోబర్ 5వ తేదీన జరిగే మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఎటువంటి అస్వస్థతకు గురైన సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి తగు చికిత్స పొందవచ్చని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి.రంగా రావు, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జె.పార్ధసారథి, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.జె.ప్రసూన, ఇంటర్మీడియట్ విద్యా శాఖ ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత, వైద్య ఆరోగ్య శాఖ డి.పి.ఎం.ఓ డా. సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ సమీకరణను విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదే



గుంటూరు, సెప్టెంబర్ 16 (మనం ప్రతినిధి): భూ సమీకరణ విధానాన్ని విజయవంతం చేసిన చరిత్ర అమరావతి రైతులదేనని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ అన్నారు. అమరావతి రెండో విడత భూ సమీకరణలో భాగంగా తుళ్ళూరు మండలం హరిశ్చంద్రాపురం గ్రామంలో భూసమీకరణపై బుధవారం జరిగిన గ్రామసభలోజిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అమరావతిని ప్రపంచంలోనే ప్రతిష్ఠాత్మక నగరంగా తీర్చిదిద్దటకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకుగాను రెండో విడత భూ సమీకరణకు ప్రభుత్వం నిర్ణయించిన సంగతి అందరికీ తెలిసిందేనని చెప్పారు. భూ సమీకరణకు అందరూ సహకరించాలని కోరారు. అమరావతి పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉంటుందన్నారు. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారని హితవు పలికారు.అమరావతిలో క్వాంటం వ్యాలీ వంటి అత్యాధునిక ప్రాజెక్టులు నెలకొల్పడం జరుగుతున్న విషయం తెలిసిందేనన్నారు. 'అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకుందామని 'ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపును గుర్తు చేశారు. రైతులు భూ సమీకరణకు భూములను అందిస్తే వెంటనే పనులను చేపట్టటకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు.ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ ఏ.భార్గవ్ తేజ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, తహసిల్దార్ హరిబాబు,సి.ఆర్.డి.ఏ భూసమీకరణ డిప్యూటీ కలెక్టర్, స్థానిక అధికారులు, అనధికారులు, రైతులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఓజోన్ పొర
# పరిరక్షణ అవగాహన పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు సెప్టెంబర్16:(మనం న్యూస్ ప్రతినిధి) గుంటూరు ఆధ్వర్యంలో ఓజోన్ పొర పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ప్రత్యేక అవగాహన పోస్టర్లు బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ,(ఏ పి పి సి బి) ప్రాంతీయ కార్యాలయం, గుంటూరు పర్యావరణ ఇంజనీర్.ఎం.డి. నజీనా బేగం,ప్రత్యేక అవగాహన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఓ-గుంటూరు సిబ్బందితో పాటు డా.తిరుపతి రెడ్డి , పర్యావరణ సమన్వయకర్త, ఐటీసీ నారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ ఎం.డి.నజీనా బేగం మాట్లాడుతూ, ఓజోన్ పొర భూమిపై జీవరాశులను సూర్యుని నుండి వెలువడే హానికరమైన అతినీలలోహిత (యు వి) కిరణాల నుండి రక్షించే సహజ కవచమని తెలిపారు. ఓజోన్ పొర పరిరక్షణకు ప్రపంచ దేశాలు చేపడుతున్న చర్యలతో పాటు,ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవన విధానాలను అవలంబించడం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఓజోన్ పొరను దెబ్బతీసే పదార్థాల వినియోగాన్ని తగ్గించడం,్పర్యావరణహిత సాంకేతికతలను ప్రోత్సహించడం,రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్ల వంటి శీతలీకరణ పరికరాలను బాధ్యతాయుతంగా నిర్వహించడం ద్వారా ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఆమె సూచించారు.'ఓజోన్ పొరను కాపాడటం అంటే భవిష్యత్ తరాలను మరియు భూమిపై జీవ వైవిధ్యాన్ని కాపాడటమే' అని ఆమె పేర్కొన్నారు. ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థులు, యువత మరియు ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

# అల్ట్రావయోలెట్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రారంభం




గుంటూరు:సెప్టెంబర్:16 (మనం ప్రతినిధి) ఎలక్ట్రిక్ పెర్ఫార్మెన్స్ మోటార్సైకిళ్ల తయారీ సంస్థ అల్ట్రావయోలెట్ ఆటోమోటివ్ నగరంలో కొత్త యూవీ స్పేస్ స్టేషన్ (ఎక్స్పీరియన్స్ సెంటర్)ను ప్రారంభించింది. డీలర్ ఆర్ఆర్ మొబిలిటీ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా అల్ట్రావయోలెట్ ఎక్స్-47 క్రాస్ఓవర్, ఎఫ్77 మోటార్సైకిళ్లు గుంటూరు వినియోగదారులకు అందుబాటులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్లో సంస్థ కార్యకలాపాల విస్తరణలో భాగంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కంపెనీ తెలిపింది. వినియోగదారులకు సమగ్ర బ్రాండ్, యాజమాన్య అనుభవాన్ని అందించేలా యూవీ స్పేస్ స్టేషన్ను రూపొందించారు. వ్యక్తిగతీకరించిన టెస్ట్ రైడ్లు, ఉత్పత్తుల ప్రదర్శన,అమ్మకాల సంప్రదింపులు, ప్రత్యేక సేవా మద్దతు,అసలైన విడిభాగాలు, మోటార్సైకిల్ యాక్సెసరీలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఎక్స్-47, ఎఫ్77 మోడళ్లలో 40.2 హెచ్పీ శక్తి, 100 ఎన్ఎం టార్క్,10.3 కిలోవాట్అవర్ బ్యాటరీ ఉన్నాయి. ఇవి 0-60 కిలోమీటర్ల వేగాన్ని 2.8 సెకన్లలో అందుకోగలవని కంపెనీ తెలిపింది. ఐడీసీ ధృవీకరించిన గరిష్ఠంగా 323 కిలోమీటర్ల రేంజ్ అందిస్తాయని పేర్కొంది.ఎక్స్-47లో 77 గిగాహెర్ట్జ్ రియర్ రాడార్, బ్లైండ్-స్పాట్ డిటెక్షన్, లేన్-ఛేంజ్ అసిస్ట్, ఓవర్టేక్ అలర్ట్, రియర్-కొలిజన్ వార్నింగ్ వంటి అధునాతన ఫీచర్లు ఉన్నాయి. అల్ట్రావయోలెట్ సహ వ్యవస్థాపకుడు,సీఈఓ నారాయణ్ సుబ్రమణియం మాట్లాడుతూ గుంటూరులో కేంద్రం ప్రారంభించడం ద్వారా ప్రాంతీయ రైడర్లు, ఔత్సాహికులకు తమ సాంకేతికత, ఇంజినీరింగ్, పనితీరును మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అల్ట్రావయోలెట్ వీపీ (సేల్స్ అండ్ సేల్స్ ట్రాన్స్ఫర్మేషన్) డి.యూ. వెంకట రామన్, ఆర్ఆర్ మొబిలిటీ ప్రొప్రైటర్ ముప్పళ్ల రోహిత్, అల్ట్రావయోలెట్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (డీలర్ డెవలప్మెంట్) కె.శ్రీధర్ పాల్గొన్నారు.

# 17న కొల్లిపరలో ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు సందర్శనలు కార్యక్రమం



గుంటూరు, సెప్టెంబర్ 16 : (మనం న్యూస్ ప్రతినిధి) ఒక నెల - ఒక నియోజకవర్గం - నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని గురువారం కొల్లిపరలో నిర్వహిస్తున్నట్లుజిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు.ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొల్లిపరలో జగన్నాథ స్వామి ఆలయం ఎదురుగా గురువారం ఉదయం 10.30గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మరియు స్థానిక శాసన సభ్యులు నాదెండ్ల మనోహర్, జిల్లా అధికారులు, నియోజకవర్గంలోని మండల అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ప్రజా ప్రతినిధులు, అధికారులకు అందజేయవచ్చని జిల్లా కలెక్టర్ వివరించారు.

# మాజీ ఉప ముఖ్యమంత్రిఆళ్ల నాని భౌతిక కాయానికి సామినేని ఉదయభాను నివాళులు

జగ్గయ్యపేట సెప్టెంబర్ 16 మనం న్యూస్: మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) ఆకస్మిక మృతికి ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఏలూరులోని నాని స్వగృహానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వాళ్ల నానితో తనకున్న పరిచయాన్ని ఈ సందర్భంగా సామినేని గుర్తు చేసుకున్నారు.



# ప్రజా సమస్య పై ప్రజల తరపున పోరాడేందుకే గడపగడపకు ప్రజా పోరుబాట

**7వ వార్డులో ప్రజా పోరు బాట లో నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు**

జగ్గయ్యపేట, సెప్టెంబర్ 16 మనం న్యూస్: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకొని వాటిపై ప్రజల తరపున పోరాడేందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు జగ్గయ్యపేట పట్టణంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమం 8వ రోజు కొనసాగింది. జగ్గయ్యపేట పట్టణంలోని 17వ వార్డు చిన్న రామాలయం వీధిలో జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిపై ప్రజల తరపున పోరాడేందుకే గడపగడపకు ప్రజా పోరుబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ తీరును ప్రజలకు వివరిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నిసా, పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, 17వ వార్డు అధ్యక్షులు షేక్ ఖాదర్, షేక్ అబ్దుల్ ఖాదర్ ఏకే తదితర వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇనాం భూ బాధితుల సమస్య ను సామినేని ఉదయభాను ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతాం

**ఇనాం రిలే నిరాహార దీక్ష శిబిరంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ హామీ**



జగ్గయ్యపేట సెప్టెంబర్ 16 మనం న్యూస్: ఈనం భూ బాధితుల సమస్యను ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతామని వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ హామీ ఇచ్చారు. బుధవారం ఎన్టీఆర్ సర్కిల్లో ఇనాం భూబాధిత సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న 9వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని కౌన్సిలర్లు కొలగాని రాము, కాశీ అనురాధ కిషోర్, షేక్ సత్తార్, ఆవుల భవాని ప్రసాద్ తదితరులతో కలిసి వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ ప్రారంభించారు.సమస్య గత పదేళ్లు గా అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టో పేర్కొంటున్నప్పటికీ పరిష్కారం కాకపోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.ఇనాం బాధితులు సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ఆందోళన కొనసాగించాలని, తమ సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. కౌన్సిలర్ కొలగాని రాము మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ సమస్యపై కనీస సానుభూతి లేదని జగ్గయ్యపేట ఎమ్మెల్యేగా ఉదయభాను ఉన్న సమయంలో సమస్య పరిష్కారానికి కృషి చేసిన జగన్ పాదయాత్రలో సమస్య రాలేదని పట్టించుకోలేదని విమర్శించారు. ఈసారి సమస్య పరిష్కారం కావాల్సిందేనని అందుకు బాధితులు చేస్తున్న న్యాయబద్ధమైన ఆందోళనకు మద్దతు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈనాం భూ బాధితుల సంఘం నేతలు ప్రముఖులు పాల్గొన్నారు.

# వీఆర్ఏల సమస్యల పరిష్కార కోసం శంఖారావం

**ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు వినతిపత్రం**



పామర్రు, సెప్టెంబర్ 16(మనం న్యూస్ ): గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్ఏ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పామర్రు మండల వీఆర్ఏలు మంగళవారం నుంచి సామూహిక నిరాకరణ సమ్మెకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (వీఆర్ఏ జేఏసీ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ సమ్మె చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాకు తను కూడా విన్నవించుకుంటూ వినతి పత్రాన్ని అందజేశారు. వీఆర్ఏ సంఘం నాయకులు అర్జీ సమర్పించారు. జిల్లా వీఆర్ఏ సంఘం నేత చాట్ల రమేష్ ఆధ్వర్యంలో వీఆర్ఏలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ విజయవాడ రోడ్డు లో రిలే ఫాస్ట్ చేపట్టారు. వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేయాలని, నామినీగా పనిచేస్తున్న వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ నంబరు 13 ప్రకారం సీనియారిటీ ఆధారంగా, ఇంటర్ విద్యార్హత కలిగిన అర్హులైన వీఆర్ఏలకు వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని వీఆర్ఏలు విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ ఆర్థికాభివృద్ధిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర కీలకం



**జిల్లా కలెక్టర్ డీకే బాలాజి**

హనుమాన్ జంక్షన్: సెప్టెంబర్ 16, ( మనం న్యూస్ ): గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బాపులపాడు మండలం, కానుమోలు గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన శాఖను ప్రారంభించారు.ఈ శాఖ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 1364వ శాఖ కాగా,గుడివాడ ప్రాంతీయ కార్యాలయ పరిధిలో 50వ శాఖగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ఆర్థికాభివృద్ధికి బ్యాంకింగ్ సేవలు, ఆర్థిక సమ్మిళితత్వం ఎంతో అవసరమన్నారు.వాణిజ్య బ్యాంకులు బ్యాంకింగ్ సేవలు అందించేందుకు వెనుకాడే మారుమూల ప్రాంతాల్లోకి సైతం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు వెళ్లి శాఖలను ఏర్పాటు చేసి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో కానుమోలులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు నూతన శాఖ ప్రారంభం కావడం హర్షణీయమన్నారు. కానుమోలు, పరిసర గ్రామాల్లోని రైతులు, ప్రజలకు ఈ శాఖ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.ప్రజలు బ్యాంకులో పొదుపు చేయడంతో పాటు బ్యాంకు అందించే వివిధ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయం,చిన్నతరహా వ్యాపారాలు,ఇతర ఆర్థిక కార్యకలాపాలను చేపట్టే వారు బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ప్రజలకు అవసరమైన బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయడం ద్వారా గ్రామీణ ఆర్థిక కార్యకలాపాలకు ఊతమివ్వాలని సూచించారు. నూతన శాఖ ప్రారంభానికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యవర్గానికి, సిబ్బందికి కలెక్టర్ అభినందనలు, తెలియజేశారు. కార్యక్రమంలో విజయవాడ విజయ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ చైర్మన్ తట్టి అర్జునరావు, కానుమోలు పి ఏ సి ఎస్ చైర్మన్ దన్నే దుర్గారావు, ఏపీ గ్రామీణ బ్యాంకు చీఫ్ రిస్క్ ఆఫీసర్ ఎం.అరుణ్ కుమారజనరల్ మేనేజర్ జె జుమ్మిలాల్ మురళీలాల్,రీజనల్ మేనేజర్ కే ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ శరణ్య, క్యాషియర్ సురేష్, నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు చింతల వెంకట శివ అప్పారావు, ల్యాండ్ లార్డ్ నండూరి సత్య వెంకటేశ్వర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల అభివృద్ధిని ప్రతిరోజూ గమనిస్తూ ప్రోత్సహించాలి

**కలెక్టర్ డీకే బాలాజీ**



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 16( మనం న్యూస్):** కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కానుమోలు సెక్టార్ పరిధిలోని పెరికేడు అంగన్వాడీ ప్రీ-ప్రైమరీ పాఠశాలను జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ బుధవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న ప్రీ-ప్రైమరీ విద్య, వారి ప్రారంభ దశ అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలను పరిశీలించారు. చిన్నారుల ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ (ఉఇృ) స్క్రీనింగ్లో భాగంగా వారి వయస్సుకు అనుగుణంగా శారీరక,మానసిక ,భాషా, అభిజ్ఞా,సామాజిక తదితర అభివృద్ధి అంశాలను అంచనా వేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. నవచేతన యాప్లో ఏఐ ఆధారిత స్క్రీనింగ్ పరిశీలన చిన్నారుల అభివృద్ధి స్థాయిని అంచనా వేసేందుకు నవచేతన యాప్లో ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ద్వారా వివరాలను నమోదు చేస్తున్న ప్రక్రియను కలెక్టర్ బాలాజీ స్వయంగా పరిశీలించారు. స్క్రీనింగ్లో భాగంగా చిన్నారులను అడిగే ప్రశ్నలు, వారు ఇచ్చే సమాధానాలు,వాటి ఆధారంగా యాప్లో వివరాలను నమోదు చేసే విధానాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ చిన్నారులతో స్వయంగా ముఖాముఖిగా మాట్లాడి,వారిని వివిధ ప్రశ్నలు వేసి వారి నుంచి వచ్చే సమాధానాలను పరిశీలించారు. చిన్నారులు వాస్తవంగా ఇచ్చిన సమాధానాల ఆధారంగానే నవచేతన యాప్లో స్క్రీనింగ్ వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

### పిల్లల ముందు తల్లిదండ్రులు సెల్ఫోన్ వినియోగాన్ని తగ్గించాలి:

అంగన్వాడీ కేంద్రానికి హాజరైన చిన్నారుల తల్లులతో కూడా జిల్లా కలెక్టర్ కొద్దిసేపు ముఖాముఖిగా ముచ్చటించారు.' ఎల్లల్లో కొన్ని అలవాట్లు ఏర్పడకూడదని తల్లిదండ్రులు ఆశిస్తున్నప్పుడు,ఆ అలవాట్లకు తల్లిదండ్రుల ప్రవర్తనే కారణం కాకుండా జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.ముఖ్యంగా పిల్లల ముందు తల్లిదండ్రులు సెల్ఫోన్ను అధికంగా వినియోగిస్తే, అది పిల్లలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని తెలిపారు. పిల్లలకు సెల్ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని చెబుతూ,తల్లిదండ్రులు మాత్రం వారి ముందు ఎక్కువ సమయం సెల్ఫోన్లో గడపడం సరైన విధానం కాదని అన్నారు.పిల్లలకు ఆదర్శంగా నిలిచేలా తల్లిదండ్రులు తమ ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని సూచించారు.

### పిల్లల లెర్నింగ్ సామర్థ్యాన్ని ప్రతిరోజూ గమనించాలి

చిన్నారుల నేర్చుకునే సామర్థ్యాన్ని (ఔ్ఛ్టుఱజ్ఞజ అఛ్జీజూఱ్జీడ) తల్లులు ప్రతిరోజూ స్వయంగా గమనిస్తూ, వారి అభివృద్ధిని ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు.ఒకే అంశాన్ని ఒకేసారి కాకుండా రోజువారీగా వివిధ అంశాలపై పిల్లలకు పరిచయం చేస్తూవారు ఎంతవరకు గుర్తుంచుకుంటు న్నారు, అర్థం చేసుకుంటు న్నారు అనే విషయాన్ని గమనించాలని తెలిపారు. ఉదాహరణకు ఒక రోజు పిల్లలకు వివిధ రంగులను గుర్తించేలా నేర్పిస్తే, మరుసటి రోజు సంఖ్యలు, ఆల్ఫాబెట్లు,ఆ తర్వాత సులభమైన కూడికలు వంటి అంశాలను పరిచయం చేసి,వాటిని పిల్లలు ఎలా నేర్చుకుంటున్నారో ప్రత్యక్షంగా గమనించాలని సూచించారు. పిల్లల అభ్యసన సామర్థ్యంలో ప్రతిరోజూ వస్తున్న మార్పులను తల్లిదండ్రులు గమనిస్తూ, వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని తెలిపారు.పిల్లలు ఏ అంశంలో ఆసక్తి చూపుతున్నారు,ఏ అంశాన్ని త్వరగా నేర్చుకుంటున్నారు,ఎక్కడ మరింత శ్రద్ధ అవసరం అనే విషయాలను గుర్తించి, వారి సామర్థ్యాలను మెరుగుపరిచేలా తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఏఐ ఆధారిత స్క్రీనింగ్ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా చిన్నారుల అభివృద్ధి స్థాయిని క్రమం తప్పకుండా అంచనా వేయడంతో పాటు, అవసరమైన చోట తగిన శ్రద్ధ చూపేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు ఎం ఆర్ ఓ బంట్రెడ్డి మురళీకృష్ణ, ఎం డి ఓ తోట తిరుమల త్రినాధరావు, ఐసీడీఎస్ పీడీ ఐ.విమల, గన్నవరం సీడీపీఓమంగమ్మ , కానుమోలు సెక్టార్ సూపర్వైజర్ కె.శాంతి శిరీష ,అంగన్వాడీ టీచర్ గొట్టాపు రజిని,సిబ్బంది చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల వైద్యానికి అండగా కూటమి ప్రభుత్వ: ఎమ్మెల్యే వసంత



**మైలవరం, సెప్టెంబర్ 16 మనం న్యూస్ :** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు, అనారోగ్య సమయం లో ఆర్థిక ఇబ్బందులు ఎదురు కాకుండా కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అండ గా నిలుస్తోందని స్థానిక శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు తెలిపారు. నియోజకవర్గం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు 1,957 మంది లబ్ధిదారులకు రూ.11.71 కోట్ల సీఎంఆర్ఎఫ్ రీయింబర్స్ మెంట్ చెక్కులు, 744 మందికి రూ.13.48 కోట్ల విలువైన ఎల్.ఓ.సిలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొత్తంగా 2,701 మంది పేదలకు వైద్య చికిత్స కోసం రూ.25.19 కోట్ల ఆర్థిక సాయం అందినట్లు వెల్లడించారు. తాజాగా రూ.2.31 కోట్లకు పైగా సీఎంఆర్ఎఫ్, ఎల్.ఓ.సిలు. తాజాగా సెప్టెంబర్ 2న మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో లబ్ధిదారు లకు అందజేశారు. తాజా విడతలో నియోజకవర్గం లోని వివిధ మండలాలకు సంబంధించి 82 సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులకు రూ.50,68, 905 మంజూరు అయ్యాయి. అలాగే సీ ఎం ఆర్ ఎఫ్ చెక్కులు, ఎల్. ఓ.సిలు కలిపి మొత్తం 172 మందికి రూ.2,31,20, 415 మంజూరైనట్లు వివరాల్లో ఉంది. మండలంలో 12 మందికి రూ.5.74 లక్షల సాయం. మండలంలో తాజాగా 12 మంది లబ్ధి దారులకు మొత్తం రూ.5, 74,539 సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. ఇందులో గ్రామానికి చెందిన అరివేణి కోటేశ్వరమ్మకు రూ.53, 084, మల్లాది రాణికి రూ.1, 50,069, మోర్సుమిల్లి గ్రామానికి చెందిన బట్టుల తులసీరామ్ము రూ.22, 114, కిలారి వెంకమ్మకు రూ.43,727, వాసం విజయ కుమారికి రూ.20,000 మంజూరయ్యాయి. మిగిలిన లబ్ధిదారులకు కూడా నిబంధనల మేరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందింది. ఇతర మండలాల్లోనూ సీ ఎం ఆర్ ఎఫ్ మంజూరు. నియోజక వర్గంలోని ఇతర మండలాల విషయానికి వస్తే రెడ్డిగూడెం లో 9 చెక్కులకు రూ.3,95, 800, జి.కొండూరులో 19 చెక్కులకు రూ.12,37,086, ఇబ్రహీంపట్నంలో 25 చెక్కులకు రూ.16,78,125, విజయవాడ రూరల్లో 17 చెక్కులకు రూ.11,83,355 మంజూరయ్యాయి. అర్హులై న ప్రతి కుటుంబానికి అండ గా ప్రభుత్వం. ఈ సందర్భం గా వసంత వెంకట కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందు లు తలెత్తకుండా ముఖ్య మంత్రి సహాయ నిధి, ఎల్. ఓ. సి ల ద్వారా అర్హులైన వారికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రజల వైద్య అవసరాలకు సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన వారికి అవసర మైన సాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.

# కానుమోలు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ బాలాజి



**హనుమాన్ జంక్షన్, సెప్టెంబర్ 16 ( మనం న్యూస్):** జిల్లా కలెక్టర్ డి కె బాలాజి బుధవారం కానుమోలు లోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ను సందర్శించారు. రోగులకు సేవలు ఎలా జరుగుతున్నాయో అక్కడి ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ కె.వాహినిని అడిగి తెలుసుకున్నారు.డాక్టర్ వాహిని కలెక్టర్ కి ఇక్కడ పంచకర్మ వైద్యం అందుబాటులో ఉందని, స్త్రీలకు వేరుగా, పురుషులకు వేరుగా, ఇద్దరు యోగా అభ్యాసకులు ఉన్నారని, అలాగే మందులు సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం వారు చాలా ఖరీదైన మందులను సైతం కేరళ నుంచి సప్లయి చేయటం వలన అనేక విధమైన దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతున్నాయని తెలిపారు.అంతేకాకుండా, హాస్పిటల్ ప్రాంగణంలో దాదాపు నలభై రకాల ఔషధ మొక్కలు కూడా పెంచుతున్నట్టు తెలిపారు. కానుమోలు డిస్పెన్సరీ, ఇండియాలోనే మొట్టమొదటి ఆయుష్ సోలార్ డిస్పెన్సరీ. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో భాగంగా బయో మెడికల్ వేస్ట్ సెగ్రిగేషన్,మరియు, కలర్ కోడెడ్ బిల్స్, మెయింటెయిన్ చేస్తున్నట్టు తెలిపారు. గైడ్లైన్స్ ప్రకారం, రైన్ వాటర్ హార్వెస్టింగ్ కూడా ఈ డిస్పెన్సరీ నందు మైంటైన్ చేయడం జరుగుతున్నది. జిల్లా కలెక్టరు ఈ సందర్భంగా డాక్టర్ .వాహినిని అభినందించారు.

# పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ప్రధాన ధ్యేయం

**కృష్ణ :గన్నవరం సెప్టెంబర్ 16(మనం న్యూస్ ):** పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ప్రధాన ధ్యేయమని, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం బాయ్స్ హైస్కూల్ మైదానం పక్కన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్ను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం కూటమి నాయకులతో కలిసి స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. అనంతరం ఆటో కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన మాధురి అనే విద్యార్థి తాను దాచుకున్న పాకెట్ మనీ నుంచి రూ.2,500 విశ్రాంత అధ్యాపకుడు మద్దుకూరి విజయ్కుమార్ రూ.లక్ష లను అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం విరాళంగా అందించారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమానికి స్వచ్ఛందంగా విరాళాలు అందించిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన అన్నా క్యాంటీన్లలో గన్నవరం కేంద్రం 277వదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రోజూ సుమారు 400 మందికి ఉదయం నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు చెప్పారు. పేదలకు రాత్రి భోజనం కూడా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కోరుతూ లేఖ రాసినట్లు వెల్లడించారు. గన్నవరంతో పాటు రామవరప్పాడులో మరో అన్నా క్యాంటీన్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గన్నవరం నియోజకవర్గ రూపురేఖలు వేగంగా మారుతున్నాయని యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. దావాజీగూడెం రహదారి, గాంధీబొమ్మ సెంటర్, కోనాయ చెరువు తదితర ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గన్నవరం వార్తలు ప్రసారం చేసేటప్పుడు రైల్వే స్టేషన్ బోర్డును మాత్రమే కాకుండా గాంధీబొమ్మ సెంటర్, ఎన్టీఆర్ విగ్రహం వంటి ప్రాంతాలను కూడా చూపించాలని మీడియాను కోరారు. ఎన్.హెచ్ పిడి విద్యాసాగర్తో మాట్లాడి గాంధీబొమ్మ సెంటర్లో గన్నవరం నియోజకవర్గం పేరుతో భారీ సూచిక బోర్డు ఏర్పాటు చేయించినట్లు వివరించారు. అమరావతి నిర్మాణంతో గన్నవరం రాజధానికి ప్రధాన ముఖద్వారంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అయోధ్య గేటెడ్ కమ్యూనిటీ వద్ద 'ఐ లవ్ గన్నవరం', 'వెన్ అమరావతి షైన్స్.. గన్నవరం రైజెస్' బోర్డులు ఏర్పాటు చేయాలని అపార్ట్మెంట్ వాసులకు సూచించినట్లు తెలిపారు. అక్కడి తాగునీరు, పన్నుల సమస్యలను 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. విమానాశ్రయం ఎదురుగా సీ-డాక్ కేంద్రాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని యార్లగడ్డ తెలిపారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారా లోకేశ్ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్కు లేఖ రాసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం అదే ప్రాంగణంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో భారీ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటుకు చేసేందుకు అంగీకారం తెలిపారని... అందుకోసం ప్రత్యామ్నాయంగా మరోచోట స్థలాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తానని, కక్షసాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒక్క వైసీపీ కార్యకర్తపైనా అక్రమ కేసు కూడా తన హయం లో పెట్టలేదని అన్నారు. ఆర్భాటపు ప్రారంభోత్సవాలు, దొంగ శంకుస్థాపనలు తనకు అలవాటు లేదని, 'చెప్పిందే చేస్తా.. చేసేదే చెబుతా' అన్న నిబద్ధతతో పనిచేస్తున్నానని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గానికి గత వైభవాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయం



**ఎమ్మెల్యే వసంత**

**మైలవరం సెప్టెంబర్ 16 మనం న్యూస్ :** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు కోడెల శివప్రసాదరావు చిత్రపటాని కి పూలవమాలలు వేసి ఘనం గా నివాళులర్పించారు. కోడెల శివప్రసాదరావు సేవలను స్మరించుకుంటూ జోహార్ అంటూ నినదిం చారు. ఈ సందర్భంగా వసంత వెంకట కృష్ణప్రసాదు మాట్లాడుతూ, తెలుగుదేశం పార్టీకి కోడెల శివప్రసాద రావు చేసిన సేవలు, ప్రజా జీవితంలో ఆయన అందిం చిన సేవలు చిరస్మరణీయ మని పేర్కొన్నారు. వైద్యుడి గా, ప్రజా ప్రతినిధిగా, శాసన సభ స్పీకర్గా ఆయన వివిధ బాధ్యతలను సమర్థ వంతంగా నిర్వర్తించారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, నియోజక వర్గ అభివృద్ధికి కోడెల శివప్రసాదరావు చేసిన కృషి ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతుందని అన్నారు. తెలుగుదేశం పార్టీ పట్ల ఆయన చూపిన నిబద్ధత, పార్టీ బలోపేతానికి చేసిన కృషి పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయక మని వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. కోడెల శివ ప్రసాదరావు ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేం దుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్య కర్తలు పాల్గొని కోడెల శివప్రసాదరావు చిత్రపటాని కి నివాళులర్పించారు.

## స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్-2026



**మైలవరం సెప్టెంబర్ 16 మనం న్యూస్ :** లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్మార్ట్ ఇండియా ఇంటర్నల్ హ్యాకథాన్-2026 (ఎస్ ఐ హెచ్ -2026) కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించా రు. కేంద్ర ప్రభుత్వ ఆవిష్క రణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ కార్య క్రమంలో వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు సాఫ్ట్ వేర్ మరియు హార్డ్వేర్ విభాగాలకు సంబంధించిన అంశాల పై 154 బృందాలు గా పాల్గొని, సమాజం, పరిశ్రమలు మరియు దేశ అభివృద్ధికి సంబంధించిన సమస్యలకు వినూత్నమైన సాంకేతిక పరిష్కారాలను ప్రతిపాదించారు. విద్యార్థు లు తమ ప్రాజెక్ట్ ఆలోచన లు, సమస్య వివరణ, ప్రతి పాదిత పరిష్కారం, సాంకేతి క విధానం మరియు అమ లు సాధ్యాసాధ్యతలను నిపుణుల సమక్షంలో ప్రదర్శించారు. ఎంపికైన ఉత్తమ ఆలోచనలను తదుపరి దశలో మరింత అభివృద్ధి చేసేందుకు అవసరమైన మార్గదర్శ కత్వం అందించనున్నారు. మొత్తంగా, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల లో నిర్వహించిన ఎస్ ఐ హెచ్ -2026 ఇంటర్నల్ హ్యాకథాన్ విద్యార్థుల ప్రతిభను వెలికితీయడంతో పాటు, ఆవిష్కరణ, పరిశోధన, టీమ్వర్క్ మరియు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే ఒక ముఖ్యమైన వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమా నికి కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.అప్పారావు, డీన్-ఐ ఆర్ వి.సూర్యనారాయణ, కన్వీనర్ రాంబాబు బూసి, టి.సత్యనారాయణ మరియు వివిధ విభాగాల డిపార్ట్మెంట్ కోఆర్డినేటర్లు హాజరై కార్యక్రమాన్ని ఘనం గా నిర్వహించేందుకు తమ సహకారం అందించారు.ఈ సందర్భంగా కళాశాల అధ్య క్షులు, ప్రిన్సిపాల్ మరియు ఇతర ప్రముఖులు విద్యార్థు లను అభినందిస్తూ, దేశంలో ని వాస్తవ సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించే దిశగా విద్యార్థులు ఆలోచించాలని సూచించారు.

## చర్చిల కూల్చివేతలు సీజ్లపై చర్యలు నిలిపివేయాలి

**క్రిస్టియన్ సొసైటీ ప్రతినిధులు అరుల్ అరుసు**




**గాంధీనగర్ సెప్టెంబర్ 16 మనం న్యూస్:** రాష్ట్రంలో ప్రార్థనా మందిరాల కూల్చివేతలు సీజ్లను నిలిపివేసి చర్చిలకు భద్రత కల్పించాలని ఏపీ క్రిస్టియన్ సొసైటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం విజయవాడ గాంధీనగర్ స్థానిక ప్రెస్క్లబ్లో సొసైటీ ప్రతినిధి అరుల్ అరుసు,ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని క్రైస్తవ నాయకులు పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను చర్చించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత 15 రోజుల్లో మూడు చర్చిలను కూల్చివేయడంతోపాటు రెండు చర్చిలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ చర్యలు బయట వ్యక్తుల కంటే అధికారుల ఆధ్వర్యంలోనే జరిగాయని ఆరోపించారు. తూర్పుగోదావరి జిల్లా పెరవల్లి మండలం కొత్తపల్లిలో ఓ చర్చిని అధికారులు సీజ్ చేశారని ఏలూరు జిల్లా ముసునూరు మండలం వలసనపల్లిలో ముందస్తు నోటీసు ఇవ్వకుండానే చర్చిని కూల్చివేశారని పేర్కొన్నారు. చర్చిలోని మైకులు కుర్చీలు ఇతర సామగ్రిని తరలించేందుకు కూడా సమయం ఇవ్వలేదన్నారు. చర్చిల కూల్చివేతలు సీజ్ల వెనుక ఏదైనా వ్యూహాత్మక చర్య లేదా రహస్య ఉద్దేశం ఉందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. పేదలు భక్తులు విరాళాలతో నిర్మించుకున్న ప్రార్థనా స్థలాలపై చర్యలు తీసుకోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని చర్యలను నిలిపివేసి ప్రార్థనా స్థలాలకు రక్షణ కల్పించాలని కోరారు. సమావేశంలో ఏపీ క్రిస్టియన్ సొసైటీ విశాఖపట్నం జిల్లా ప్రతినిధులు కుంపట్ల జేమ్స్, పాల్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం



- **గ్రామాల్లో ఏకాభిప్రాయ నిర్ణయాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి**
- **గ్రూపులు, వర్గ విభేదాలకు తావులేదు.. అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం**
- **పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే వసంత**

**మైలవరం సెప్టెంబర్ 16 మనం న్యూస్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయా లని శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో నిర్వహించి న మండల టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకా భిప్రాయ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలి. రాబోయే రోజుల్లో పంచాయతీ వార్డు సభ్యుడి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్ వరకు ఎలాంటి ఎన్నికలు వచ్చినా, ఏ గ్రామానికి ఏ రిజర్వేషన్ వస్తుందో ముందుగా ఎవరికీ తెలియదని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ తదితర రిజర్వేషన్లు రాజ్యాంగ బద్ధ మైన ప్రక్రియలో నిర్ణయించ బడతాయని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయం తీసుకుంటే ఆ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు సహజ మేనని, అయితే ఏకా భిప్రాయం వచ్చిన తర్వాత వ్యక్తిగత అభిప్రాయాలు, వర్గ విభేదాలకు తావివ్వ కుండా సమిష్టి నిర్ణయాన్ని గౌరవించాలని సూచించారు.

### గ్రూపులను ప్రోత్సహించడం పార్టీ విధానం కాదు.

గ్రూపులను ప్రోత్సహిం చడం, వర్గాలను నడపడం తెలుగుదేశం పార్టీ విధానం కాదని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాదు స్పష్టం చేశారు. పార్టీ జెండాను మోస్తూ నిరంతరం కష్టపడుతున్న కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికలు ఒక పండుగ వంటి వని, వారి కష్టానికి తగిన ఫలితం వచ్చేలా ప్రతి నాయకుడు అండగా నిలవాలని సూచించారు. పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి అడ్డంకులు సృష్టించే చర్యలను సహించబోమని తెలిపారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి, కూటమి అభ్యర్థుల విజయానికి సమిష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు.

### సర్పంచ్ నుంచి కౌన్సిలర్ వరకు విజయమే లక్ష్యం.

స్థానిక నియోజకవర్గంలో సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీ తదితర స్థానాల్లో కూటమి అభ్యర్థు ల విజయానికి కృషి చేయా లని ఎమ్మెల్యే పిలుపు నిచ్చారు. కొండపల్లి మున్సి పాలిటీలో కౌన్సిలర్ స్థానా ల్లోనూ కూటమి అభ్యర్థు లను గెలిపించేందుకు సమన్వయంతో పనిచేయా లని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ, ప్రజలు, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. వ్యక్తిగత విభే దాలను పక్కనపెట్టి సమిష్టి గా పనిచేస్తేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లగలమని పేర్కొన్నారు.

### అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాం తరంగా ముందుకు తీసు కెళ్తున్నామని వసంత కృష్ణప్రసాదు తెలిపారు. గ్రామాల అవసరాలను గుర్తించి శాశ్వత అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న రహదారి పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తున్నామని చెప్పారు. వెల్వడం నుంచి చంద్రాల వరకు సుమారు రూ.6 కోట్లతో రహదారి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామాల అంతర్గత రహదారుల నిర్మాణానికి తాజాగా రూ.17 కోట్ల నిధులు వచ్చినట్లు తెలిపారు. అవసరమైన గ్రామాలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి, పనులను త్వరిత గతిన మంజూరు చేసి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### రూ.80 కోట్ల విలువైన రహదారులు, వంతెనల ప్రతిపాదనలు.

నియోజకవర్గంలోని వివిధ రహదారులు, వంతెనల నిర్మాణానికి సుమారు రూ.80 కోట్ల విలువైన ప్రతిపాదనలను ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. పుల్లూరు, చిలుకూరు, కుదప, ఓబులాపురం, హెచ్. ముత్యాలంపాడు తదితర ప్రాంతాలకు సంబంధించిన పెండింగ్ పనులకు ప్రాధాన్య త కల్పిస్తున్నామని చెప్పారు.

### రెడ్డిగూడెంలో కమ్యూనిటీ హాల్కు రూ.75 లక్షలు.

రెడ్డిగూడెంలో ఎస్సీ సోదరుల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేసినట్లు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు తెలిపారు. గతంలో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగని పరిస్థితులు ఉన్నాయని, ప్రస్తుతం సంబంధిత కాంట్రాక్టర్తో మాట్లాడి నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

### అభివృద్ధి నిరంతర ప్రక్రియ.

అభివృద్ధి అనేది ఒక్క రోజులో పూర్తయ్యే కార్య క్రమం కాదని, అది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిం చేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గానికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రహదారులు, మౌలిక వసతులతో పాటు సంక్షేమ కార్యక్రమాలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేర కు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు గ్రీవెన్స్, ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వసంత కృష్ణప్రసాదు తెలిపారు. ఒక సమస్య పరిష్కారమైన వెంటనే మరో సమస్య ముందుకు వస్తుందని, అభివృద్ధి చెందుతున్న సమాజంలో ప్రజా సమస్య ల పరిష్కారం నిరంతరం కొనసాగాల్సిన ప్రక్రియ అని అన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను తెలుసు కుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిం చేందుకు కృషి చేస్తున్నాము అని తెలిపారు.ప్రజలు కష్టాల్లో ఉన్న సమ యంలో వారికి అండగా నిలవడం ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్య కర్తల బాధ్యత అని ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు అన్నారు. అనా రోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా అందు బాటులో ఉన్న సహాయాన్ని అందించేందుకు పార్టీ నాయకులు చొరవ చూపాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి వంటి పథకాల ద్వారా అర్హులకు సహాయం అందేలా కృషి చేయాలని అన్నారు. ఒక కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు వారికి చేయగలిగిన సహాయం చేయకుండా కేవలం ఎన్నికల సమయంలో ఓట్లు అడగడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.

### ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉండాలి.

ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉంటూ గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి సమిష్టిగా పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ కార్యకర్తలకు ఒక ముఖ్యమైన అవకాశం అని, గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపునిచ్చారు.

# నంబూరు రైల్వే లైనుకు భూములు కోల్పోతున్న రైతులు అర్.డి.ఓ తో సమావేశం



**వీరులపాడు సెప్టెంబర్ 16, మనం న్యూస్:** వీరు లపాడు మండల పరిధిలో తెలంగాణ రాష్ట్రం ఎర్రిపాలెం టు నంబూరురైల్వే లైన్ కు భూములు కోల్పోతున్న రైతులతో జుజ్జూరు తాసిల్దార్ కార్యాలయంలో జుజ్జూరు, చెన్నారావు పాలెం గ్రామాలకు చెందిన రైతులతో నందిగామ ఆర్డీవో జీ అనిల్ కుమార్ సోమవారం సమావేశం నిర్వహించారు. రైల్వే లైన్ 16- 12-2024 సంవత్సరం లో నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని దాని ఆధారంగానే అప్పటి మార్కెట్ వాల్యూ ప్రకారం రైతులకు భూమికి సంబంధించిన ధరను ఇవ్వటం జరుగుతుందన్నారు జుజ్జూరు మార్కెట్ వేల్యూ ప్రకారం 11,77,000 చెన్నారావు పాలెం 9 లక్షల రూపాయలు ఎకరం ధర ఉండటం జరిగిందని దానికి 2.5 చొప్పున రైతులకు నష్టపరిహారం అందజేస్తున్నామన్నారు రైతులు కోటేరు ముత్తారెడ్డి, ఆవుల రమేష్ బాబు ఆధ్వర్యంలో రైతులుప్రభుత్వ నిబంధన ప్రకారం భూములు కోల్పోతున్న రైతులు ప్రభుత్వం ప్రకటించిన ధరకు భూములు ఇచ్చేదే లేదని అధికారులకు వివరించారు. ప్రస్తుతం ఎకరం ధర బహిరంగ మార్కెట్లో 50 నుంచి 60 లక్షల రూపాయల వరకు పలుకుతుందని రాష్ట్ర ప్రభుత్వం రైతులను వారి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని తెలంగాణ రాష్ట్రంలో రైల్వే లైన్ లో భూములు కోల్పోయిన రైతులకు ఐదు రెట్లు నష్టం పరిహారం అదేవిధంగా ఈ ప్రాంత రైతులకు కూడా అందజేయాలని అధికారులకు సూచించారు కొంతమంది రైతుల భూముల్లో భూమి మధ్యలో నుంచి రైల్వే లైన్ పోవడం వలన రెండు పక్కల భూమిలోకి రైతులు వెళ్లేందుకు రహదారి నిర్మాణాలు కూడా చేపట్టాలని అధికారులకు సూచించారు అదేవిధంగా రైతులు తమ పంటల విలువ ప్రకారం ఆ భూమిలో ఉన్న రైతుకు సంబంధించి ఇల్లు ఇతర పంటలను వాల్యూ ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని వారికి తెలియజేశారు అనంతరం తెలంగాణలో భూములు కోల్పోయిన రైతులకు అక్కడి ప్రభుత్వం ఏ విధంగా ఐదు రెట్లు ధరణి ఇచ్చిండు అదేవిధంగా ఎక్కడ ప్రాంత రైతులకు కూడా అందజేయాలని ఆర్డిఓ జి అనిల్ కుమార్ కు రైతులు వినతి పత్రం అందజేశారు తమ్మిశెట్టి యాదాద్రి భవాని జుజ్జూరు రైతు సర్వం కోల్పోతున్నాము మాకు జుజ్జూరు గ్రామ రెవెన్యూ పరిధిలో ఎకరం భూమి ఉన్నది దానిలో 75 సెంట్లు వరకు రైల్వే లైన్ లో భూమి కోల్పోతుంది మాకు ముగ్గురు ఆడపిల్లలు ఆ భూమి మీద ఆధారపడి జీవిస్తున్నాము ప్రభుత్వం ఇచ్చే ధరకు మా భూమిని తీసుకుంటే నేను సర్వం కోల్పోతాము మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి రాజధాని ఫ్లాట్లు ఇవ్వాలి కన్నేకంటే రాంబాబు జుజ్జూరు రైతు రైల్వే లైన్ లో భూములు కోల్పోతున్న రైతులకు అమరావతి ప్రాంతంలో ప్రభుత్వం ఫ్లాట్లు కేటాయించాలని ఆయన కోరారు రైల్వే లైన్ ప్రాముఖ్యతను బట్టి రైతులను అన్ని విధాలు ఆదుకోవాలని అని కోరారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రవికుమార్ రైల్వే ఏఈ కె.వి మధుసూదన్ డిటి నాగరాజు ఆర్ఐ బిగ్సు గౌడ్ రైతులు పాల్గొన్నారు

# చైన్ చేసింగ్ కేసులో ముద్దాయి తన్నీరు కార్తీక్ అరెస్ట్



**వీరులపాడు సెప్టెంబర్ 16, మనం న్యూస్:** వీరులపాడు పోలీస్ స్టేషన్,ౖాఖీఖ జిల్లా క్లూలు లేని పరిస్థితిలోనూ బంగారు నానుతాడు లాక్కెళ్లిన కేసు ఛేదన - ముద్దాయి అరెస్ట్ వీరులపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒంటరిగా గేదెలు మేపుకుంటున్న వృద్ధ మహిళపై దాడి చేసి, ఆమె మెడలోని బంగారు నానుతాడును బలవంతంగా లాక్కొని పరారైన ఘటనపై ఇటౖా.145/2026ఖ/ట304(2) ఔఖి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 12.09.2026 తేదీన ముద్దాయి తన్నీరు కార్తీక్, తండ్రి: నరసింహారావు (లేట్), వయస్సు 26 సంవత్సరాలు, ఆఇ-వడ్డెర, గూడెం మాధవరం గ్రామం, వీరులపాడు మండలం, వృద్ధ మహిళ ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించి, జనసంచారం తక్కువగా ఉన్న ప్రదేశంలో ఆమెపై దాడి చేశాడు. ముఖాన్ని కప్పుకొని, రోడ్డుపక్కన ఉన్న రాయితో ఆమె తలపై కొట్టి, ఆమె మెడలోని బంగారు నానుతాడును లాక్కొని మోటార్ సైక్పై అక్కడి నుండి పరారయ్యాడు. సంఘటన అనంతరం ప్రారంభ దశలో ముద్దాయి గురించి స్పష్టమైన క్లూలు ఏవీ లేకపోవడంతో పోలీసులు ఈ కేసును సవాలుగా తీసుకున్నారు. సంఘటన జరిగిన ప్రాంతం మరియు పరిసర ప్రాంతాల్లోని ఇఇ ఇర్ఘ్చుట్చ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించి, ముద్దాయి వెళ్లిన మార్గం, ఉపయోగించిన మోటార్ సైకిల్ మరియు అతని కదలికలను గుర్తించారు. అదేవిధంగా స్థానికంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని సేకరించి, అనుమానితుల కదలికలు, సంఘటనకు ముందు మరియు తరువాత వారి కార్యకలాపాలు, ప్రయాణ మార్గాలు తదితర అంశాలపై సమగ్రంగా విచారణ చేపట్టారు. ఇఇ ఇర్ఘ్చుట్చ ఫుటేజీలు, స్థానిక సమాచారం మరియు ఇతర దర్యాప్తు ఆధారాలను సమన్వయం చేస్తూ ముద్దాయి ఆచూకీని గుర్తించారు.ఈ క్రమంలో 14.09.2026 సాయంత్రం సుమారు 06:00 గంటలకు పెద్దాపురం ఆంధ్రా బోర్డర్ చెక్పోస్ట్ వద్ద ముద్దాయి తన్నీరు కార్తీక్ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు.దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు ఊఐఖలోని 304(2) ఔఖి సెక్షన్కు అదనంగా 307 మరియు 317 ఔఖి సెక్షన్లను చేర్చారు. ప్రస్తుతం కేసు 304(2), 307 ట/రీ 317 ఔఖి కింద దర్యాప్తు కొనసాగుతోంది. ప్రారంభంలో ఎటువంటి స్పష్టమైన క్లూలు లేకపోయినప్పటికీ, ఈ కేసును తక్కువ సమయంలోనే ఛేదించడంలోౖాఖీఖ పోలీస్ కమిషనర్ శ్రీ ఖి.ꕷ ఖ్బుట్చజుజ్చిట ఔ్చఝ ఐఖి మార్గదర్శకత్వం, ృఇ్క ఖఝ్చుజా శ్రీ ఆ. ఔ్చజుటజిర్ఘుజీ్ౖాట్చఢ్చు, ఐఖి పర్యవేక్షణ మరియు నందిగామ అఇ్క శ్రీ ఇజి. ఖిటజ్చీజీర్చిట్చ ఖ్చౌ దిశానిర్దేశం ఎంతో కీలకంగా నిలిచాయి. అదేవిధంగా ఇఐ, నందిగామ రూరల్ శ్రీ్ౖఉఔ్ౖాజీఛీం ప్రత్యక్ష పర్యవేక్షణలో, వీరులపాడు ఖఐ శ్రీ ఆ. అఃజీర్ఘ్చుఛమరియు సిబ్బంది కఇ ఖిఙ్చిజీజు ఖిఙ్ఘ్చు, ఖిఖ ఓటజీటఙ్చు కట్చట్చఛీ మరియు ఏౌర్ఘు ఎ్చటఛీ ఖ్చిజుజ్చిట సమన్వయంతో, అంకితభావంతో మరియు నిరంతర కృషితో దర్యాప్తు నిర్వహించారు. ఇఇ ఇర్ఘ్చుట్చ ఫుటేజీల విశ్లేషణ, స్థానిక సమాచారం సేకరణ, ముద్దాయి కదలికలపై నిఘా మరియు ఇతర దర్యాప్తు ఆధారాలను సమన్వయం చేయడం ద్వారా ఎటువంటి ప్రారంభ క్లూలు లేని ఈ కేసును చాలా తక్కువ సమయంలోనే ఛేదించి ముద్దాయిని అరెస్ట్ చేయడంతో పాటు దొంగిలించిన బంగారు నానుతాడును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో సిబ్బంది చూపిన ప్రతిభ, అంకితభావం మరియు సమన్వయ కృషిని గుర్తించిన ఇఐ నందిగామ రూరల్ శ్రీ్ౖఉఔ్ౖాజీఛీం సంబంధిత సిబ్బందిని అభినందించి, వారికి రివార్డులు అందజేశారు. సిబ్బంది కృషిని ఉన్నతాధికారులు కూడా ప్రశంసించారు. అరెస్టు అనంతరం ముద్దాయికి వైద్య పరీక్ష నిర్వహించి, అవసరమైన చట్టపరమైన విధివిధానాలను పూర్తి చేసి, గౌరవనీయులైన అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వారి కోర్టు, నందిగామ ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్కు పంపించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది అని వీరులపాడు పోలీస్ స్టేషన్ వారు ఒక ప్రకటన లో తెలియచేసినారు.

# ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా పోస్టర్ ప్రజెంటేషన్ పోటీ

**మైలవరం సెప్టెంబర్ 16 మనం న్యూస్ :** స్థానిక లకిరెడ్డి బాలి రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్స వాన్ని పురస్కరించుకుని ప్రకృతి - పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 16న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, పోస్టర్ ప్రజెంటే షన్ పోటీ నిర్వహించారు. ఈ ఏడాది ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా గ్లోబల్ యాక్షన్ ఫర్ ఏ కూలర్ ప్లానెట్ - సెలెబ్రే టింగ్ 10 ఇయర్స్ అఫ్ సూస్తాయినబ్లె కూలింగ్ అండర్ ది కిగాలి ఆమెండ మెంట్ టు ది మంట్రీల్ ప్రోటోకాల్ అనే అంతర్జాతీయ థీ్వ కార్యక్రమాన్ని నిర్వహించా రు. ఓజోన్ పొర పరిరక్షణ, మాంట్రియల్ ప్రోటోకాల్ ప్రాముఖ్యత, సుస్థిర శీతలీకరణ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. కళాశాల ప్రిన్సిపాల్ కె. అప్పారావు కార్యక్రమానికి హాజరై విద్యార్థుల పోస్టర్ ప్రజెంటేషన్లను పరిశీలించి, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. సి ఎస్ ఈ విభాగాధిపతి ఎస్. నాగార్జున రెడ్డి కూడా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ప్రోత్సహిం చారు. పోస్టర్ ప్రజెంటేషన్ పోటీకి ఫెడరేషన్ విభాగం కెమిస్ట్రీ ప్రొఫెసర్ వి. పార్వతి న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. విద్యార్థు లు ఓజోన్ పొర క్షీణత, దాని ప్రభావాలు, ఓజోన్ పరి రక్షణ చర్యలు, సుస్థిర శీతలీకరణ విధానాలను వివరిస్తూ వివిధ అంశాలపై సృజనాత్మక పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ప్రకృతి క్లబ్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు వి. భాగ్యలక్ష్మి, షహీదా నిలోఫర్ సమన్వయం చేశారు. విద్యార్థి కోఆర్డినేట ర్లు మరియు పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# సమానమైన ఏఐ కోసం ఒక బిలియన్ డాలర్ల కేటాయించిన గేట్స్ ఫౌండేషన్

**గాంధీనగర్ సెప్టెంబర్ 16 మనం న్యూస్:** ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, అవకాశాలను విస్తరించేందుకు సమానమైన కృత్రిమ మేధస్సు (ఏఐ) అభివృద్ధికి గేట్స్ ఫౌండేషన్ రాబోయే రెండేళ్లలో కనీసం 1 బిలియన్ డాలర్లను కేటాయించనున్నట్లు ప్రకటించింది. ఫౌండేషన్ 10వ వార్షిక 2026 గోల్కీపర్స్ నివేదికను విడుదల చేసిన సందర్భంగా ఈ ప్రకటన చేసింది. 'మేక్ దిస్ మ్యాటర్: ఏఐ, ఈక్విటీ, అండ్ ది ఛాయిస్ వి కాంట్ డిలే' పేరుతో విడుదలైన నివేదికలో, ఏఐ ధనిక-పేదల మధ్య అంతరాలను పెంచకుండా తగ్గించేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొంది. ప్రజలు మాట్లాడే అన్ని భాషల్లో ఏఐ పనిచేసేలా చేయడం, ఆయా ప్రాంతాలు-జనాభా అవసరాలకు అనుగుణంగా ఏఐ సాధనాలను రూపొందించడం, వాటిని వినియోగించే వైద్యులు, రైతులు, ఉపాధ్యాయులు, డెవలపర్లకు అవసరమైన నైపుణ్యాలు, అందుబాటు కల్పించడం వంటి మూడు ప్రధాన అంశాలను నివేదిక గుర్తించింది. కేటాయించే నిధుల్లో సుమారు 40 శాతం విద్య, మరో 40 శాతం ఆరోగ్య సంరక్షణకు వినియోగించనున్నారు. వ్యవసాయానికి 10 శాతం, సమానమైన ఏఐకు అవసరమైన డిజిటల్ పునాదుల అభివృద్ధికి మరో 10 శాతం కేటాయించనున్నారు. అత్యధిక అవసరాలు ఉన్న ప్రజలకు ఏఐ ప్రయోజనాలు అందేలా ప్రభుత్వాలు, సాంకేతిక సంస్థలు, దాతృత్వ సంస్థలు కలిసి పనిచేయాలని ఫౌండేషన్ పిలుపునిచ్చింది.

# పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రచురణపై మండల స్థాయి రాజకీయ పార్టీల సమావేశం నిర్వహణ

**కంచికచర్ల సెప్టెంబర్ 16(మనం న్యూస్):** ఈ రోజు కంచికచర్ల గ్రామంలో ఎంపీపీ కార్యాలయంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రచురణకు సంబంధించి అన్ని మండల స్థాయి రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడమైనది.ఈ సమావేశానికి కంచికచర్ల ఎంపీడీవో అధ్యక్షత వహించారు. ఎంపీడీవో మరియు మండలంలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాను వివరంగా వివరించడం జరిగింది. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం రాజకీయ పార్టీల నుండి ఏవైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని కోరడమైనది.సమావేశం ముగింపులో, హాజరైన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రచురణ యొక్క సంతకం చేసిన ప్రతులను పంపిణీ చేయడమైనది





# టైటాన్-గ్రేడ్ మన్నికతో రెడ్మీ నోట్ 17 ప్రో సిరీస్



**గాంధీనగర్ సెప్టెంబర్ 16 మనం న్యూస్:** షియోమీ ఇండియా రెడ్మీ నోట్ 17 ప్రో సిరీస్ను విడుదల చేసింది. బ్యాటరీ, మన్నిక, కెమెరా, పనితీరులో అధునాతన సదుపాయాలతో ఈ సిరీస్ను రూపొందించినట్లు సంస్థ తెలిపింది. రెడ్మీ నోట్ 17 ప్రో మ్యాక్స్లో 10,000 ఎంఏహెచ్ సిలికాన్-కార్బన్ బ్యాటరీ, 100 వాట్ల హైపర్ఛార్జ్, రెడ్మీ నోట్ 17 ప్రోలో 9,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 67 వాట్ల హైపర్ఛార్జ్ ఉన్నాయి. రెండు ఫోన్లలోనూ వైర్డ్ రివర్స్ ఛార్జింగ్ సదుపాయం ఉంది. ఎస్జీఎస్, టీయూవీ డబుల్ ఫైవ్-స్టార్ నాణ్యత ధ్రువీకరణలతో పాటు కార్నింగ్ గొరిల్లా విక్టస్ 2 రక్షణ, ఐపీ66, ఐపీ68, ఐపీ69, ఐపీ69కే రేటింగ్లను అందించారు. రెండు మోడళ్లలో 6.83 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్ప్లే, 3,500 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 120 హెర్ట్జ్ రిఫ్రెష్ రేట్ ఉన్నాయి. ప్రో మ్యాక్స్లో 50 మెగాపిక్సెల్ ఓఐఎస్ ప్రధాన కెమెరా, 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్ కెమెరా, 32 మెగాపిక్సెల్ ముందు కెమెరా ఉన్నాయి. ప్రోలో 50 మెగాపిక్సెల్ ఓఐఎస్ ప్రధాన కెమెరా, 8 మెగాపిక్సెల్ అల్ట్రా-వైడ్, 16 మెగాపిక్సెల్ ముందు కెమెరా ఉన్నాయి. ప్రో మ్యాక్స్ స్నాప్డ్రాగన్ 6 జెన్ 5, ప్రో స్నాప్డ్రాగన్ 6ఎస్ జెన్ 4 మొబైల్ ప్లాట్ఫామ్లపై పనిచేస్తాయి. ఆండ్రాయిడ్ 16 ఆధారిత హైపర్ఓఎస్ 3తో పాటు నాలుగేళ్ల సాఫ్ట్వేర్ అప్డేట్లు, ఆరేళ్ల భద్రతా నవీకరణలు అందనున్నాయి. రెడ్మీ నోట్ 17 ప్రో 5జీ సెప్టెంబర్ 17 నుంచి, ప్రో మ్యాక్స్ 5జీ సెప్టెంబర్ 23 నుంచి విక్రయానికి అందుబాటులోకి రానున్నాయి. ధరలు రూ.33,999 నుంచి ప్రారంభమవుతాయి.